

ఇంతకంటే ఇంకేం కావాలయ్యా!

- ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచాడు
- పెద్ద కొడుకులా మమ్మల్ని చంద్రబాబు ఆదుకుంటున్నాడు
- 'ఆంధ్రజ్యోతి'తో పలువురు పింఛనుదారులు

'ఇంత పెద్ద మొత్తంలో పింఛను డబ్బు తీసుకోవడం చాలా ఆనందంగా ఉందయ్యా. వైద్యం, ఇతర ఖర్చులకు సరిపోతాయి. పెద్ద కొడుకులా చంద్రబాబు మమ్మల్ని ఆదుకున్నాడు. ఇంతకంటే ఇంకేం కావాలి. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం' అంటూ పింఛనుదారులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. 1వ తేదీ సోమవారం రోజు తొంబై శాతం మందికిపైగా పింఛను సొమ్ము అందజేయగా, మంగళవారం మిగిలిన వారికి సచివాలయ సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా పింఛను నగదు అందుకున్న లబ్ధిదారులు ఆంధ్రజ్యోతితో తమ మనోభావాలు పంచుకున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం



ఈ చిత్రంలోని వృద్ధురాలు మదిర రమణమ్మ, మరో వృద్ధుడు జక్కల రత్నం. పొదలకూరులోని రామమం దిరం వద్ద నివసిస్తున్నారు. జక్కల రత్నం అవివాహితుడు. అక్క మదిర రమణమ్మతో కలిసి ఉంటున్నాడు. పెద్ద కుమారుడిలా సీఎం చంద్రబాబు పింఛను సొమ్ము ఒక్కొక్కరికి రూ.7వేలు అందజేశాడంటూ వారిద్దరూ ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. ఈ నగదుతో నెలంతా హాయి గా గడిచిపోతుంది. చంద్రన్న చల్లని చూపుతో మేము హాయిగా కాలం వెళ్లదీస్తాం. మంచి ఆహారం, మందుల కొనుగోలుకు ఇబ్బందులు ఉండవు. అంటూ చెప్పుకొచ్చారు.



ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు..

సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తొలినెలలోనే పెండింగ్‌తో కలిపి రూ. 7వేలు పింఛన్ ఇచ్చారు. వీటితోపాటు రూపాయి బియ్యంతో మాకుటుంబ పోషణ సాగిపోతుంది. జగన్‌రెడ్డి అరాచకాలకు ప్రజలు స్వస్తి పలికి చంద్రబాబుకు పట్టంకట్టారు. ఆయన పాలనలో రాష్ట్రం బాగా అభివృద్ధి చెందుతుందని నమ్ముతున్నా.

- ఓలేటి సుబ్బయ్య, పెనుబల్లి, బుచ్చి మండలం



బాధలు అర్థం చేసుకున్న చంద్రన్న

మా బాధలను సీఎం చంద్రబాబు నాయుడు అర్థం చేసుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛను డబ్బు రూ.7 వేలు అందజేయడం సంతోషంగా ఉంది. నెలవారి మందులు, ఇతరత్రా ఖర్చులకు పింఛన్ సొమ్మే ఆధారం. నిరాధరణకు గురవుతున్న వారి పట్ల నిరంతరం పనిచేస్తూ పేదల పక్షపాతి అని మరోసారి చంద్రన్న నిరూపించుకున్నారు.

- గోపిదేశి వెంకటసుబ్బయ్య, దాసరిపల్లి, ఉదయగిరి



తిరుపతిలో ఆసుపత్రికి వచ్చి..

ఆరోగ్యం బాగోలేక కొన్నిరోజుల కిందట తిరుపతిలోని రూయా ఆసుపత్రిలో చేరాను. సచివాలయ సర్వేయర్ విజయ్ మంగళవారం తిరుపతికి వచ్చి నాకు రూ.6వేల పింఛన్ నగదు అందజేశారు. నమ్మలేక పోతున్నా. ఆపదలో తనను టీడీపీ ప్రభుత్వం ఆదుకోవడం సంతోషంగా ఉంది.

- కమతం బాబు, అనంతసాగరం



ఊహించలేకపోయా!

అనారోగ్యంతో పది రోజులుగా నారాయణ వైద్యశాలలో చికిత్స పొందుతున్నా. చేతిలో చిల్లిగవ్వలేదు. సీఎం చంద్రబాబునాయుడు పెంచిన పింఛన్ రూ.7వేలు ఇస్తున్నారని తెలిసింది. కానీ ఇంటికి వెళ్లలేని పరిస్థితి. టీడీపీ నాయకులు, బూత్ ఇన్‌చార్జ్ పోతకమూరి నరహింహారావు, సచివాలయ సిబ్బంది ఖాజా మస్తాన్‌ను వెంట పెట్టుకుని వైద్యశాలకు వచ్చి నాకు రూ.7 వేలు ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది. అసలు ఈ నెలలో పింఛన్ తీసుకుంటానని ఊహించలేదు. ఆపదలో ఉన్న నాకు చంద్రన్న ఇంటి పెద్ద కొడుకులా ఆదుకున్నారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటా.

- పర్వతాల పద్మ, జండాదిబ్బ, సంగం



నా జీవనానికి ఇది చాలు

70 ఏళ్ల వయసులో ఒంటరిగా ఉంటున్నా. నా జీవనానికి నెలకి రూ.4 వేలు చాలు. ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం పెంచిన పింఛనుతోపాటు రూ.7 వేలు ఇచ్చింది. ఇంత మొత్తంగా పింఛను వస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు. ఒంటరిగా ఉన్న నాకు ప్రతినెలా రూ.4 వేలు పింఛను వస్తుందనే ధైర్యం వచ్చింది. చంద్రబాబు నాయుడు ఒక ముఖ్యమంత్రిగా కాదు... నా కుటుంబ సభ్యుడిగా ప్రతి నెలా కొడుకు ఇచ్చినట్టుగా నాకు డబ్బులు ఇచ్చి నన్ను ఆదుకుంటున్నట్టుగానే ఉంది.

- కోడి వెంకమ్మ, అల్లూరు



నిద్రలేపి ఇచ్చారయ్యా!

నేను దివ్యాంగుడిని. సచివాలయ సిబ్బంది నిన్న ఉదయాన్నే నిద్ర లేపి రూ.6వేలు పింఛన్ ఇచ్చారు. ఎంతో సంతోషమేసింది. చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్‌ను ఇంటి వద్దకే వచ్చి ఇవ్వడం గొప్ప విషయం. వలంటీర్ల ప్రమేయం లేకుండా సచివాలయ, పంచాయతీ సిబ్బందితో పింఛన్లు ఇంటికే చేర్చడం ఆనందం కలిగిస్తోంది. చంద్రబాబు రాష్ట్రానికి శాశ్వత సీఎంగా కొనసాగుతారు.

- తిరుదాకుల విజయకుమార్, కోవూరు



వైద్య ఖర్చులకు ఊతం

నా వైద్యఖర్చులకు ఊతం అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా పింఛను అందింది. ఉదయాన్నే పింఛను రావడం సంతోషం కలిగించింది. మా అంగన్‌వాడీ కార్యకర్త నిద్రలేపి పింఛను ఇచ్చారు. నేను ఆశ్చర్యపోయా. అంత ఉదయాన్నే పింఛను పంపిణీకి చర్యలు తీసుకొన్న చంద్రబాబు పట్టుదలకు జై కొడుతున్నా.

- బొప్పూరు నాగేశ్వరరావు, విడవలూరు




పింఛన్ పెంచిన దేవుడాయన

మాలాంటోళ్ల బాధలు చూసి రూ.3 వేలు వచ్చే పింఛన్‌ను సీఎం చంద్రబాబు రూ.6వేలు చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇంతకుముందు రూ.3వేలే కదా ఇచ్చేది. రెండు నెలల డబ్బు ఒకసారి వస్తే కూరాకు, మాత్రలు, పిల్లకాయల ఖర్చులకు పనికొచ్చేయి. టీవీల్లో చెప్పినట్టే రూ.6వేలు ఇస్తానన్నాడు. చెప్పినట్టే ఇచ్చాడు. ఆ దేవుడు ఇచ్చింది చాలు మాకు..!

- అద్దూరు రవి, దివ్యాంగుడు, కాగితాలపూరు, మనుబోలు

నూతన కలెక్టర్ ఆనంద్

- గతంలో గూడూరు సబ్ కలెక్టర్‌గా విధులు
- హరినారాయణన్ బదిలీ



నూతన కలెక్టర్ ఆనంద్

నెల్లూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నూతన కలెక్టర్‌గా ఓ ఆనంద్ నియమితులయ్యారు. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం విశాఖపట్నంలో కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ప్రస్తుతం జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం హరినారాయణన్‌ను బదిలీ చేస్తూ ఆయన స్థానంలో ఆనంద్‌ను నియమించింది. కేరళ రాష్ట్రానికి చెందిన ఆనంద్ ఇంజనీరింగ్ పట్టభద్రులు. పేద కుటుంబం నుంచి ఉన్నతస్థాయికి ఎదిగిన అధికారి. 2016 బ్యాచ్‌లో కేరళ నుంచి టాపర్‌గా నిలిచారు. తూర్పుగోదావరి జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత తొలి పోస్టింగ్‌ను గూడూరు సబ్ కలెక్టర్‌గా పొందారు. 2018-19 మధ్య కాలంలో గూడూరులో సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారు. 2019 ఎన్నికల సమయంలో గూడూరు నియోజకవర్గ ఆర్‌వోగా సమర్థవంతంగా పనిచేశారు. అనంతరం పలు చోట్ల విధులు నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, పార్వతీపురం ఐటీడీఏ పీవోగా పనిచేశారు. జిల్లాలోని భౌగోళిక పరిస్థితులపై నూతన కలెక్టర్‌కు అవగాహన ఉంది. కాగా, ఇప్పటి వరకూ పనిచేస్తున్న హరినారాయణన్ గతేడాది ఏప్రిల్‌లో కలెక్టర్‌గా జిల్లాలో బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

నడిరోడ్డుపై హాహాకారాలు



ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థులు

"అమ్మా.. వెళ్లొస్తా.."నంటూ టాటా చెప్పి స్కూలు బస్సు ఎక్కిన చిన్నారులు నిమిషాల వ్యవధిలోనే ప్రమాదం బారిన పడ్డారు. బిడ్డలు ఎక్కిన బస్సు బోల్తా పడిందని తెలుసుకుని కన్నపేగు తల్లడిల్లిపోయింది. చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకుంటూ దుఃఖాన్ని దిగమింగుకుని పరుగున ఆసుపత్రులకు చేరారు. రక్తగాయాలతో మంచాలపై పడుకొని ఉన్న పిల్లల్ని చూసి కన్నీటిని ఆపుకోలేకపోయారు. ఇళ్ల వద్ద బయలుదేరిన బస్సు హైవేపై మలుపు తిరిగే క్రమంలో డివైడర్ మధ్యలో ఆగింది. అంతే వెనుక నుంచి ఓ మినీలారీ వేగంగా దూసుకొచ్చి బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు విద్యార్థులు గాయపడ్డారు. మంగళవారం ఉదయం కావలి సమీపంలో జరిగిన ఈ ప్రమాదం సంచలనంగా మారింది.



రోడ్డుపై క్లీనర్ చిన్నకొండయ్య మృతదేహం



మృతుడు చిన్న కొండయ్య (ఫైల్)

- హైవేపై మలుపు తిరుగుతున్న స్కూలు బస్సును ఢీకొన్న మినీలారీ
- రోడ్డుపైనే బోల్తా పడిన బస్సు
- ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో తప్పిన ఘోరం
- క్లీనర్ మృతి, పలువురు విద్యార్థులకు గాయాలు
- ఓ విద్యార్థి చెన్నైకి తరలింపు
- ప్రమాద విషయం తెలుసుకుని తల్లిదండ్రుల ఆందోళన



ప్రమాదానికి గురైన స్కూల్ బస్

కావలి రూరల్, జూలై 2 : కావలి పట్టణం ముసునూరు టోల్‌ప్లాజా వద్ద మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్‌ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్ నడుస్తోంది. మంగళవారం ఉదయం కావలిలోని పుల్లారెడ్డి నగర్, రామ్మూర్తిపేటకు చెందిన 29 మంది విద్యార్థులతో స్కూలు బస్సు బయలు దేరింది. టోల్‌గేట్ దాటాక స్కూల్ వైపు వెళ్లేందుకు జాతీయ రహదారి డివైడర్ దాటే క్రమంలో అవతల మార్గంలో ఎదురుగా ఓ లారీ రావటంతో డివైడర్ మధ్యలోనే డ్రైవర్ బస్సును ఆపేశాడు. అయితే, అదే సమయంలో ఓ మినీ లారీ వేగంగా వస్తూ వెనుకవైపు నుంచి స్కూలు బస్సును ఢీకొంది. దీంతో డివైడర్ మధ్యలో బస్సు బోల్తా పడటంతో డోర్‌లో నిలబడి ఉన్న క్లీనర్ దేవరాల చినకొండయ్య (72) బస్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇక బస్సులో ఉన్న విద్యార్థులు భయంతో కేకలు వేయడంతో వాహన చోదకులు, స్థానికులు హుటాహుటిన అక్కడకు చేరుకుని అందరినీ బయటకు తీశారు. బోల్తాపడిన బస్‌ను పైకి లేపారు. బస్సులో ఉన్న 29 మంది చిన్నారులను అదే పాఠశాలకు చెందిన బస్సులలో కావలిలోని రెండు ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు.



ప్రమాదానికి కారణమైన మినీ లారీ

● 19 మందికి గాయాలు

విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనతో ఆసుపత్రులకు పరుగులు తీశారు. గాయాలతో చిన్నారుల ఏడుపులు, తల్లిదండ్రుల రోదనలతో ఆసుపత్రుల ప్రాంగణం గందరగోళంగా మారింది. పది మంది విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఇళ్లకు పంపారు. మరో 10 మందికి స్వల్పగాయాలవగా, మరో 9 మందికి మోస్తరు గాయాలు అయ్యాయి. వీరిలో అఖిలేష్ రెడ్డి అనే విద్యార్థిని మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు. మృతుడి కుమారుడు దేవరాల వెంకయ్య ఫిర్యాదు మేరకు కావలి రూరల్ ఇన్‌చార్జి సీఐ కొండవీటి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రమాదం విషయం తెలిసిన వెంటనే జేసీ సేతుమాధవన్, ట్రాన్స్‌పోర్టు కమిషనర్ చంద్ర, అదనపు ఎస్పీ సౌజన్యలతో పాటు ఆర్డీవో వై.సుధాకర్ రెడ్డి, ఎంపీడీవోలు సుందర్‌రావు, కరుణాకర్, తహసీల్దారు నగేష్ తదితరులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. స్కూలు బస్సు 24 సీట్లకు మాత్రమే పరిమితి ఉండగా 29 మందిని తీసుకువెళ్తూ ప్రమాదానికి గురైనట్లు రవాణాశాఖ అధికారులు గుర్తించారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థులను జేసీ, ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి, ఆర్డీవో శీనా నాయక్ పరామర్శించారు.

● కాగా, ఈ ఘటనపై నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. అలాగే నెల్లూరు పార్లమెంట్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ కూడా బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మరో ప్రకటనలో తెలియచేశారు.



బాలుడితో మాట్లాడుతున్న జేసీ, ఆర్డీవో

అడ్డదారులతో ప్రమాదంలోకి నెట్టి!

కావలి : తమ పాఠశాలకు సమీప మార్గంలో వాహనాలు ప్రవేశించేందుకు ఏర్పాటు చేసుకున్న అడ్డదారే పిల్లల్ని ప్రమాదానికి గురి చేసింది. జాతీయ రహదారి మధ్యలో డివైడర్‌ను పగలకొట్టి అనధికారికంగా రోడ్డు క్రాసింగ్ ఏర్పాటు చేసుకున్నారు. దీనివలన ప్రమాదాలు జరుగుతాయని తెలిసినా అధికారులు పట్టించుకోలేదు. ఇది అనధికార దారి కావడంతో హైవేపై ఎలాంటి సూచిక బోర్డులు లేవు. వాహనాలు వేగంగా వస్తూ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నా గడిచిన పదేళ్ల ప్రతాప్‌కుమార్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉండటంతో అధికారులు కూడా నోరు మెదపలేదు.

● సిద్ధం సభకూ అంతే..

అలాగే సార్వత్రిక ఎన్నికలకు ముందు కావలి మద్దూరుపాడు బైపాస్‌రోడ్డు సమీపంలో జరిగిన 'సిద్ధం' సభకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ వచ్చారు. అప్పుడు కూడా జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను వైసీపీ నాయకులు పగలకొట్టి అనధికారికంగా దారి ఏర్పాటు చేసుకున్నారు. ఆ సభ అయిపోయి నెలలు గడిచినా, రాష్ట్రంలో ప్రభుత్వం మారినా డివైడర్ మధ్యలో ఉన్న దారిని మాత్రం మూయించలేదు. హైవేపై అనధికార మలుపులు తెలియక వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతా తెలిసి కూడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అనధికార మలుపు వద్ద మంగళవారం ఉదయం స్కూల్ బస్సు డివైడర్ దాటుతుండగా వెనుక నుంచి వచ్చిన మినీ లారీ ఢీకొట్టింది. అదృష్టవశాత్తు బస్సు బోల్తా పడిన సమయంలో అటువైపు వాహనాలు ఏవీ రాకపోవడంతో ఘోరం తప్పింది. ఇప్పటికైనా హైవే అధికారులతోపాటు జిల్లా ఉన్నతాధికారులు స్పందించి జాతీయరహదారిపై అక్రమంగా ఏర్పాటు చేసిన దారులను మూసివేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

దారులు మూయమని లేఖ రాశాం

స్కూల్ బస్సు ప్రమాదానికి గురైన వెంటనే ముసునూరు, మద్దూరుపాడుల వద్ద డివైడర్‌లను పగలకొట్టి ఏర్పాటు చేసిన దారులు మూసివేయమని నేషనల్ హైవే పీడీకి లేఖ రాశాం. అప్పటి వరకు అక్కడ డివైడర్ మధ్యలో ట్రాఫిక్ స్టాపర్లను అడ్డుగా పెట్టాం. త్వరలో ఈ రెండుదారులు మూయిస్తాం.

- శీనానాయక్, కావలి ఆర్డీవో



హైవేపై డివైడర్‌ను తొలగించి ఆర్ఎస్సార్ స్కూల్లోకి ఏర్పాటు చేసిన ప్రవేశ మార్గం

రామలింగేశ్వరుడికి నందివాహన సేవ

- రామతీర్థం, దండిగుంట గ్రామాల్లో గ్రామోత్సవం



విడవలూరు, జూలై 2: రామతీర్థం బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి మహాశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన నందివాహన సేవను వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారి శ్రీకాంత్‌శర్మ స్వామి, అమ్మవార్లకు గణపతి పూజ, పుణ్యాహవచన, మహాన్యాస రుద్రాభిషేకాలు, కుంకుమార్చనలు, నివేదన, బలిహరణ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం దండిగుంట గ్రామంలో స్వామివారికి గిన్నెభిక్ష కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి స్వామివారిని వివిధ రకాల పూలతో అలంక రించిన నంది వాహనంపై ఆశీనులను చేశారు. అనంతరం రామతీర్థం, దండిగుంట గ్రామాల్లో ఊరేగించారు.

● 13 ఏళ్లుగా స్వామివారి సేవలో..

రామచంద్రాపురానికి చెందిన బుచ్చింగారి తిరుపతి, ఆదిశేషమ్మ కుటుంబ సభ్యులు గత 13 ఏళ్లుగా స్వామి, అమ్మవార్లకి పూలంగిసేవ నిర్వహిస్తున్నారు. కర్ణాటకలోని మైసూర్, ఊటీల నుంచి ప్రత్యేకంగా పూలను తీసుకువచ్చి ఆలయ ముఖద్వారాన్ని, నందీశ్వరుడిని సుందరంగా అలకరింప చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామకృష్ణ, గుమస్తా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- 1, 2 తేదీల్లోనే జీతాలు, పెన్షన్లు
- ఆనందంలో ఉద్యోగులు, పెన్షనర్లు

నెల్లూరు (హరనాథపురం), జూలై 2 : రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఎన్డీఏ ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం 1, 2వ తేదీలకల్లా ఉద్యోగులు, పెన్షనర్ల ఖాతాల్లో వేతనాలు జమ చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ప్రభుత్వం ఉద్యోగుల జీతాల చెల్లింపులకు ప్రాధాన్య ఇచ్చింది. నిధులను సర్దుబాటు చేసి రెండో తేదీ సాయంత్రంలోగా జీతాలు, పెన్షన్ల చెల్లింపులకు పూనుకొంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో జీతాలు, పెన్షన్ల కోసం ఉద్యోగులు, పెన్షనర్లు ఎదురుచూసేవారు. నెల మొదలై రెండు వారాలు గడిచినా చాలామంది ఖాతాల్లో వేతన సొమ్ము జమ అయ్యేది కాదు. దీంతో ఉద్యోగులు, పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులు పడేవారు. తెలుగుదేశం అధికారం చేపట్టిన తరువాత ప్రతినెలా ఒకటవ తేదీన జీతాలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఆర్థిక శాఖ నిధుల కొరత వల్ల రెండో తేదీన జీతాలు చెల్లిస్తామని ప్రకటించింది. చంద్రబాబు సూచనలతో ఒకటో తేదీన కొందరికి, 2వ తేదీన మిగిలిన వారికి జీతాలు చెల్లించారు. చంద్రబాబు సూచనలతో ఇకపై ప్రతి నెలా 30, 31 తేదీలలో జీతాలు ఉద్యోగుల అకౌంట్లలో జమ కానున్నాయి. కాగా, జిల్లాలో 25 వేల మంది ఉద్యోగులు ఉండగా ప్రతినెలా రూ.300 కోట్ల మేర జీతాలు చెల్లిస్తున్నారు. అలాగే, 20వేల మంది పెన్షనర్లు ఉండగా, రూ.200 కోట్లను పెన్షన్‌గా చెల్లిస్తున్నారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఆనం

చెప్పి వదిలేసేవాడ్ని కాదు..

ఆర్నెళ్లలో ప్రగతి చూపాలి!

- అంకితభావంతో పని చేయండి
- సాగునీటి వనరులు, రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టండి
- ఆత్మకూరుకు ఆధునిక హంగులు సమకూరాలి
- అధికారుల సమీక్షలో మంత్రి ఆనం ఆదేశం



ఆత్మకూరు, జూలై 2 : 'ఆత్మకూరును అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుంచాలి. అందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి. పని చేసేవారిని ఆదరిస్తాం. ప్రోత్సహిస్తాం. అధికారులతో నాకు ఘర్షణ ఉండదు. మీరు, నేను ప్రజాసేవ చేసేందుకే ఉన్నాం. నేను చెప్పి వదిలేసేవాడిని కాదు.. గుర్తుంచుకోండి.. ఆరు నెలల్లో ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధిలో ప్రగతి చూపించి తీరా'లని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆత్మకూరులో ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో ఆనం సమీక్షించారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు రెండు వారాల్లో తాగునీటి సరఫరా చేయాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారుల పనితీరు మారకపోతే అవసరమైతే మున్సిపాలిటీకి నుడా నుంచి ప్రత్యేకాధికారి నియమిస్తానని తెలిపారు. ఆత్మకూరు మున్సిపాలిటీగా ఏర్పడ్డాక ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని, ఈ వివరాలు సేకరించాలని ఆదేశించారు. వర్షాకాలం రాబోతున్నదున చెరువులు, కాలువల్లో పూడికతీత, గుర్రపుడెక్క తొలిగింపు వంటి పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ పరిధిలోని రహదారుల అభివృద్ధిపై శ్రద్ధ వహించాలని సూచించారు. చేజర్ల మండలం పెరుమాళ్లపాడు బ్రాంచ్ రోడ్డు నిర్మాణానికి 5.5 వెడల్పుతో ప్రతిపాదనలు తయారు చేసి 3 నెలల్లో పనులు ప్రారంభించాలని సూచించారు. ముందుగా ఆయన మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అతిథి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిథిలావస్థలో ఉన్న పంచాయతీరాజ్ అతిథి గృహం స్థానే ఆధునిక హంగులతో నూతన భవనం పనులను మూడునెలల్లో ప్రారంభించాలని ఆదేశించారు. సమీక్ష అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె మధులత, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, ఎన్డీసీసీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు కృష్ణమోహన్, ఆర్ వెంకటేశ్వర్లు, ఈ గంగాధర్, అశోక్‌కుమార్, షేక్ ఫజులుల్లా తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఐదిళ్లలో చోరీ

- సంగం మండల కేంద్రంలో ఘటన
- 34 గ్రాముల బంగారు నగలు, రూ.లక్ష నగదు మాయం
- తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్ • భయాందోళనలో గ్రామస్థులు

సంగం, జూలై 2: మండలకేంద్రంలోని ఐదు ఇళ్లలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ చోరీలో 34 గ్రాములు బంగారు నగలు, రూ.లక్ష నగదు మాయమైంది. బాధితులు, పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. దుండగులు తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకున్నారు.



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి

● స్థానిక రామాలయం వద్ద అనుమాలశెట్టి రామారావు ఇంటికి తూర్పు, పడమర రెండు ద్వారాలు ఉన్నాయి. తూర్పు వైపు ద్వారానికి తాళం వేసి పడమర గదుల్లో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి వెనుక ద్వారం తాళం పగల కొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లో మనుషులు నిద్రిస్తున్నారని తెలుసుకుని వారు ఉండే గదికి బయట గడియపెట్టారు. బయట కుక్కలు అరవడం.. వంటింట్లో అలికిడి రావడంతో బయటలకు రావడానికి ప్రయత్నించారు. కానీ బయట గెడి పెట్టి ఉండడంతో దొంగలు వచ్చారని భావించి యజమాని రామారావు పోలీసులకు ఫోన్ చేశారు. వారు అక్కడి చేరుకోవడంతో బయటకు వచ్చిన కుటుంబ సభ్యులు తూర్పు వైపు తలుపు గడియ పగలకొట్టిన విషయం గుర్తించి వంటిట్లో పరిశీలించారు. రాత్రి స్నానం చేసేటపుడు యజమాని భార్య 4 సవర్ల బంగారు గాజులు వంటింట్లో పెట్టినట్లు పోలీసులకు చెప్పింది. చూస్తే నగలుతోపాటు అందులోని రూ.రెండు వేలను తీసుకెళ్లారు. పోలీసులు చుట్టూ గాలించినా ఆచూకీ తెలియలేదు.

ఉదయానికి మరో నాలుగు ఇళ్లలో చోరీ..

● అనంతరం బెంగూరు బేకరీకి ఎదురుగా ఉన్న పప్పూరు వెంకటేశ్వర్లు రాత్రి ఇంటికి తాళం వేసి నిద్రించేందుకు జొన్నవాడ ఆలయానికి వెళ్లారు. ఉదయం తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగల కొట్టి ఇంట్లో బీరువా తెరిచి ఉంది. అందులోని బట్టలన్నీ చిందరవందరగా పడేశారు. బీరువాలో ఉంచిన రూ.50 వేలు, రెండు గ్రాముల కమ్మలు మాయమైయ్యాయి. అయితే బట్టలోను ఉన్న నాల్గున్నర సవర బంగారు చైన్ మొదట్లో పోయిందనుకున్నా బట్టలోనే ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు.

● అలాగే రాళ్లచెలిక వీవర్స్ కాలనీలోని పాఠశాలకు ఎదురుగా తాళం వేసి ఉన్న గువ్వల హజరత్తయ్య ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 250 గ్రాములు వెండి గొలుసులు, రూ. 3వేలు మాయమైయాయి.

● అదే గ్రామంలోని ఎస్టీకాలనీలోని జగన్నాథం పెట్రోలు బంకు పక్క వీధిలో తాళం వేసి ఉన్న ఇండ్ల శ్రీనివాసులు ఇంట్లోకి ప్రవేశించి మంచం పరుపు కింద ఉన్న రూ.50 వేల నగదు తీసుకెళ్లారు. బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా పడేశారు. కానీ 69ఇంచుల టీవీని దుండగులు పగల కొట్టారు.

● అదేవిధంగా కొత్తూరులో తాళం వేసి తిరుమలకు వెళ్లిన పట్టెం శ్రీనివాసులు అనే టీచర్ ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లో గాలించారు. కానీ ఇంట్లో నగదు, నగలు లేకుండా జాగ్రత్త పడడంతో ఎలాంటి నష్టం జరుగలేదు.

క్లూస్ టీమ్‌తో పరిశీలన

ఒకేరోజు అర్ధరాత్రి తాళాలు వేసి ఉన్న ఐదు ఇళ్లలో చోరీ జరుగడంతో సంగం ఎస్ఐ నాగార్జునరెడ్డి సంఘటన స్థలాలను పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చోరీ జరిగిన అన్ని ఇళ్లలో వేలిముద్రలు సేకరించారు. దుండగులను పట్టుకునేందుకు పోలీసులు సంగంలోని పలుచోట్ల ఉన్న ప్రభుత్వ ప్రైవేట్ సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, జూలై 2: మండలంలోని కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై మంగళవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు, తిరుపతి జిల్లా గూ డూరుకి చెందిన శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యంలు మోటర్ బైక్‌పై పని నిమిత్తం ముత్తుకూ రుకు వెళ్లి తిరిగి వస్తున్నారు. సర్వేపల్లి రైల్వే గేటు దాటిన తర్వాత పోర్టు రోడ్డుపై ఒక్కసారిగా గేదెలు అడ్డురావడంతో వాటిని తప్పించే ప్రయత్నంలో బైక్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం సర్వేపల్లిలోని ఓ ప్రైవేటు క్లీనిక్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	130
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6852
వెండి కిలో ధర	రూ. 90,500
వెండి ఒక గ్రాము	రూ. 92.50

సోమశిలలో 10.143 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారానికి డ్యాంలో 10.143 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 366 క్యూసె క్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ధర ఉన్నా.. ఉత్పత్తి ఏదీ!?



విక్రయానికి సిద్ధంగా ఉన్న ఉప్పు కుప్పలు

అల్లూరు, జూలై 2 : మార్కెట్లో ఉప్పు ధర ఆశాజనకంగా ఉన్నా ఉత్పత్తి మాత్రం తగ్గుముఖం పట్టింది. జనవరి నుంచి సెప్టెంబరు వరకు సీజన్ కావడంతో ఉప్పు ఉత్పత్తి అధికంగా ఉంటుంది. అయితే ధరలే ఊగిసలాడుతూ ఉంటాయి. కానీ ఇటీవల అడపాదడపా వర్షాలు కురవడం, ఆకాశం మేఘావృతమై ఉండటంతో ఉప్పు ఉత్పత్తికి ప్రతికూలంగా మారింది. దీంతో ఉప్పు ఉత్పత్తికి మరో మూడు నెలల సీజన్ ఉన్నా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో ఉత్పత్తి నిలిచిపోతుంది. ఇదే సమయంలో ఉప్పు ధర ఆశాజనకంగా ఉన్నా ఉత్పత్తి లేకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. సాధారణంగా వేసవిలో విరివిగా ఉప్పు ఉత్పత్తి అయ్యే కాలం కాబట్టి క్వింటం ధర రూ.150 నుంచి రూ.200 వరకు పలుకుతుంటుంది. కానీ ఉత్పత్తి ఆగిపోవడంతో ప్రస్తుతం రూ.230 నుంచి 250 వరకు పలుకుతోంది. మరో నెల రోజుల్లో రూ.300 పైచిలుకు కూడా పలికే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు.

అడపాదడపా కురుస్తున్న వర్షాలతో ఉప్పు రైతుల దిగాలు



కయ్యలో ఉప్పును సేకరిస్తున్న రైతు

● ఏటా ఇదే వాతావరణం

జిల్లాలో అత్యధికంగా విడవలూరు, అల్లూరు, బోగోలు మండలాల్లో ఉప్పు ఉత్పత్తి జరుగుతుండగా, ఇక్కడ నుంచే అత్యధికంగా ఎగుమతి చేస్తుంటారు. ఈసారి ప్రతికూల వాతావరణం ఏర్పడటంతో ఉత్పత్తి నిలిచిపోతుంది. ఉప్పు ఉత్పత్తి చేసుకొని నిల్వ చేసుకుంటే వర్షాకాలంలో మార్కెట్ ధరలు పెరిగి మరింత ఆదాయం చేకూరే పరిస్థితి ఉంటుంది. కానీ మార్చి నుంచి ఉత్పత్తి అయిన ఉప్పు ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో ఉన్న ధరలకే విక్రయించి చివరి రెండు మాసాలైన జూలై, ఆగస్టు నెలల్లో వచ్చే ఉప్పును నిల్వ చేసుకునే ఆనవాయితీ ఉంటుంది. ఈ ఏడాది భిన్నంగా మారి జూన్‌లోనే వాతావరణంలో మార్పులు ఏర్పడి ఉత్పత్తి తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

● రెండేళ్లుగా ధర ధమాల్

రెండేళ్ల క్రితం క్వింటం ఉప్పును రూ.70 నుంచి 120 లకే మాత్రమే విక్రయిస్తూ వచ్చారు. ప్రస్తుతం రెండేళ్లుగా కొంత మెరుగైన ధరతో క్వింటం రూ.400 నుంచి 450 వరకు పలికింది. సాగుదారుల్లో ఈ ఆనందం ఇప్పుడు ఆవిరైంది. మధ్యస్థ ధరగా రూ.200 నుంచి 300 పలికి పరిస్థితి ఉన్నా ఉత్పత్తి నిలిచిపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

వాతావరణంలో మార్పులు మాపై ప్రభావం



వాతావరణంలో ఏర్పడే మార్పులు మా జీవితాలపై ప్రభావం చూపుతాయి. వర్షాకాలం, శీతాకాలాల్లో ఆరు నెలలు పనులు లేకుండా ఉండి వేసవి సమీపిస్తున్న క్రమంలో చేపట్టే ఉప్పు ఉత్పత్తి ఒకింత ఆనందాన్ని ఒకింత బాధను మిగుల్చుతాయి. ధరలు ఆశాజనకంగా ఉన్నా ఉత్పత్తి లేక ఇబ్బందులు పడుతున్నాం.

- పురిణి ఏడుకొండలు, తూర్పు గోగులపల్లి, అల్లూరు

నిలకడ లేని రంగంగా...



నిలకడ లేని రంగంగా ఉప్పు ఉత్పత్తి రంగం మారిపోయింది. వాతావరణంలో ఏర్పడిన మార్పులపై ఈ రంగం ఆధారపడి ఉంటుంది. మబ్బులు కమ్మిన వాతావరణం ఉంటే ఉప్పు రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటాయి. వర్షాలు కురిస్తే ఉత్పత్తి చేసిన ఉప్పును జాగ్రత్త చేసుకోలేక అలానే వదిలేయాల్సి ఉంటుంది. ధరలు ఆశాజనకంగా ఉన్నా ఉత్పత్తి నిలిచిపోవడంతో మా జీవితాల్లో మబ్బులు కమ్మేసినట్టు మరలా ఆరు నెలలు సీజన్ కోసం ఎదురు చూడాల్సి వస్తుంది.

- గోళ్ల ఆదాం, తూర్పు గోగులపల్లి, అల్లూరు

ఐటీఐ రెండో విడత సీట్ల భర్తీ

- దరఖాస్తులకు ఆహ్వానం

నెల్లూరు (విద్య), జులై 2 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి తొలి విడతలో భర్తీకాని సీట్లలో ప్రవేశం కోసం రెండో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఐటీఐ కళాశాలల కన్వీనర్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జీజీబీఇఆఔరి.జీ వెబ్‌సైట్‌లో ఈనెల 24వతేదీలోపు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. అభ్యర్థి చేరాలనుకున్న కళాశాలలను వెబ్‌సైట్‌లో ఇచ్చిన లింక్ ద్వారా ఎంపిక చేసుకోవాలని సూచించారు. అనంతరం దరఖాస్తును ప్రింట్ తీసుకుని భద్రపరచుకోవాలన్నారు. ఈనెల 25వతేదీన ఒరిజినల్ సర్టిఫికెట్లలతో తాను చేరదలుచుకున్న ఐటీఐలో హాజరై ధ్రువీకరణ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐ అభ్యర్థులకు ఈనెల 27, 28 తేదీల్లో, ప్రైవేట్ ఐటీఐ అభ్యర్థులకు ఈనెల 29, 30 తేదీల్లో కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

18 నుంచి కుష్ఠు వ్యాధిపై సర్వే

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(వైద్యం), జూలై 2 : ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వే చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఈ వ్యాధిపై పలు శాఖల అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. సర్వేలో వ్యాధిగ్రస్తులను గుర్తించి వెంటనే చికిత్సలు ప్రారంభిస్తే 6 నెలల్లో కుష్ఠు పూర్తిగా నయమవుతుందని చెప్పారు. వ్యాధిపై ప్రజలలో ఉన్న అపోహలను తొలగించేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 6 ఏళ్లలోపు చిన్నారులకు కుష్ఠు వ్యాధి పరీక్షలు నిర్వహించాలని, జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కుష్ఠువ్యాధి నిర్మూలనకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలీ, జిల్లా పరిషత్ సీఈవో కన్నమనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, మహిళా సంక్షేమశాఖ అధికారి హేనాసుజన్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి సురేంద్రబాబు పాల్గొన్నారు.

ఒక ఉద్యోగి ఒక స్థానంలో ఐదేళ్లకు మించి పనిచేయడానికి వీల్లేదని ప్రభుత్వ నిబంధనలు చెబుతుంటాయి. ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారిని మరోచోటుకి బదిలీ చేస్తుంటారు. కానీ కొందరు ఉద్యోగులు మాత్రం దొడ్డిదారిలో ఒకే స్థానంలో ఏళ్ల తరబడి పాతుకుపోతున్నారు. మరొక ఉద్యోగికి ఆ స్థానంలో అవకాశం కల్పించకుండా తమకున్న రాజకీయ, ఆర్థిక బలాన్ని ప్రయోగిస్తున్నారు. వీరిపై అవినీతి ఆరోపణలు ఎక్కువైనా, వీరి మూలంగా వివాదాలు చెలరేగినా సంబంధిత అధికారులు కూడా అదే పంథాలో వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రస్తుతం ఇరిగేషన్ శాఖలో ఈ పరిస్థితి ఉద్యోగుల మధ్య పెద్ద వివాదాన్నే రాజేసింది. ఉద్యోగులు విధులను మరిచి ఎమ్మెల్యేల వద్ద పంచాయితీలకు తిరుగుతున్నారు. దీంతో ఎమ్మెల్యేలు ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.





- జలవనరుల శాఖలో అస్తవ్యస్తంగా పాలన
- నెల్లూరులో పాతుకుపోయిన కొందరు ఉద్యోగులు
- వేరే ప్రాంతాల్లో పోస్టింగ్.. ఇక్కడికి డైవర్షన్
- ఇతర ఉద్యోగుల అభ్యంతరాలతో తలెత్తిన వివాదం
- ఎమ్మెల్యేల వద్దకు చేరిన పంచాయితీ
- ఇంజనీర్లదీ ఇదే పరిస్థితి..!

అక్కడ పోస్టు.. ఇక్కడ సీటు!

నెల్లూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఇరిగేషన్ సర్కిల్, సెంట్రల్ డివిజన్ కార్యాలయాల్లో కొందరు ఉద్యోగులు పది, ఇరవై ఏళ్ల నుంచి పాతుకపోయి ఉన్నారు. నిబంధనల ప్రకారం వీరు బదిలీ అయినప్పటికీ డైవర్షన్ పేరుతో మళ్లీ పాత స్థానాల్లోనే తిష్ఠ వేసి కూర్చుకుంటున్నారు. ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను సాధారణ బదిలీలపై కూడా నెల్లూరుకు రానీయకుండా అడ్డుకుంటు న్నారు. ఈ తంతు చాలా కాలం నుంచి జరుగుతోందని ఆ శాఖలో చర్చించుకుంటున్నారు. ఏళ్లతరబడి పాతుకుపోయిన ఉద్యోగులు చేతివాటానికి బాగా అలవాటు పడినట్లు ఆరోపణలున్నాయి. చేయి తడపనిదే ఏ ఫైల్ కూడా వీరి వద్ద నుంచి కదలని పరిస్థితి. ఒక వేళ వీరు బదిలీ అయినప్పటికీ ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం నుంచి సెంట్రల్ డివిజన్‌కు, సెంట్రల్ డివిజన్ నుంచి మళ్లీ సర్కిల్ కార్యాలయానికి తిరుగుతూ ఉంటారని కొందరు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండు కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సీనియారిటీ వివరాలను బయటకు తీస్తే ఎవరు ఎంత కాలం నుంచి ఏఏ కార్యాలయాల్లో పనిచేశారో స్పష్టమవుతుందని అంటున్నారు.

పరిష్కరించని అధికారులు

బదిలీల విధానాన్ని డైవర్షన్ పేరుతో ఇరిగేషన్ శాఖలో అపహాస్యం చేస్తున్నారు. సర్వీసు రూల్స్ ప్రకారం ఒక ఉద్యోగి బదిలీ అయినప్పటికీ ఆ తర్వాత డైవర్షన్ పేరుతో అధికారులు వారికి కావాల్సిన చోటికి మారుస్తున్నారు. ఈ మాత్రం దానికి బదిలీ చేయడం ఎందుకన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇరిగేషన్ సర్కిల్, సెంట్రల్ డివిజన్‌లో పాతుకుపోయిన ఉద్యోగులే కాదు.. ఆఖరుకు ఇంజనీర్లు కూడా ఇదే డైవర్షన్ విధానాన్ని అలవాటు చేసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలోని రెగ్యులర్ ఇరిగేషన్, సోమశిల, టీజీపీ విభాగాల్లో పనిచేస్తున్న చాలా మంది ఇంజనీర్లు.. వారి రెగ్యులర్ పోస్టుకు, ప్రస్తుతం పనిచేస్తున్న పోస్టుకు సంబంధమే లేదు. అనేక మంది ఏఈఈలు, డీఈఈలు జీతం తీసుకుంటున్న చోట కాకుండా డైవర్షన్ పేరుతో మరొక చోట పనిచేస్తుండడం గమనార్హం. దీంతో వివాదాలు నెలకొన్నాయి. గతంలోనే ఇటువంటి వివాదాలు తలెత్తినా అధికారులు పరిష్కరించకపోవడంతో మళ్లీ ఇప్పుడు మొదలయ్యాయి. ఫలితంగా అసలు పనిని పక్కనపెట్టి ఒకరిపై మరొకరు ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు చేసుకునే పరిస్థితి నెలకొంది.

ఇంటి దారి విషయమై ఇరువర్గాల ఘర్షణ

- ఒకరికి గాయాలు

జలదంకి, జూలై 2: మండలంలోని అన్నవరంలో ఇంటికి వెళ్లే ఉమ్మడి దారి విషయంలో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య వివాదం జరిగింది. దారిలో మట్టి వేస్తున్నారంటూ ఓ వర్గానికి చెందిన నలుగురు వ్యక్తులు కాటంరెడ్డి మాల్యాద్రిరెడ్డిపై దాడికి పాల్ప డ్డారు. గాయపడిన ఆయనను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించగా చేయి విరిగిందని వైద్యులు నిర్ధారించి మంగళవారం శస్త్ర చికిత్స చేశారు. తనపై గ్రామానికి చెందిన కాటంరెడ్డి మధుసూదనరెడ్డి, కాటంరెడ్డి రమణారెడ్డి, కాటంరెడ్డి మల్లికార్జునరెడ్డి, కాటంరెడ్డి రాజమ్మలు దాడి చేశారని బాధితుడు మాల్యాద్రిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



దాడిలో గాయపడ్డ కాటంరెడ్డి మాల్యాద్రిరెడ్డి

ఆ ఫోన్ చేసింది ఎవరు..!?

- డాక్టర్ జ్యోతి మృతిపై కొనసాగుతున్న దర్యాప్తు

నెల్లూరు(వైద్యం), జూలై 2 : చేజర్ల మండలం చిత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నంబూరి జ్యోతి (36) మరణం మిస్టరీపై పోలీసు దర్యాప్తు కొనసాగుతోంది. జ్యోతిది ఆత్మహత్యేనని వైద్యులు భావిస్తున్న నేపథ్యంలో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఇందులోనూ కాళ్లు విరిగి, మెడ ఎముక విరగటంతో జ్యోతి మృతి చెందినట్లు తెలిసింది. అయితే జ్యోతి బలవన్మరణానికి ముందు ఆమెకు వచ్చిన ఫోన్ కాల్ ఎవరిదనేది మిస్టరీగా మారింది. దీనిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఓ వైద్యుడు డాక్టర్ జ్యోతికి ఫోన్ చేసినట్లు సమాచారం. ఆ ఫోన్ మాట్లాడుతూనే తీవ్ర ఒత్తిడికి గురైన జ్యోతి ప్రభుత్వ వైద్య కళాశాల నాల్గవ అంతస్థుకు వెళ్లి అక్కడి నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరగాల్సి ఉంది. కాగా, మృతురాలు జ్యోతి తల్లిదండ్రులు హైదరాబాద్ నుంచి నెల్లూరుకు చేరుకుని పోలీసులకు రాత పూర్వకంగా రిపోర్టు ఇచ్చినట్లు తెలిసింది. వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పనిచేసే ఓ వైద్యుడితో జ్యోతి సన్నిహితంగా ఉండేదని, ఆమె మృతికి సదరు వైద్యుడు కూడా కారణమై ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలు నిగ్గు తేల్చాల్సి ఉంది.

ప్రసన్నుడి ఆలయ హుండీ లెక్కింపు

బిట్రగుంట, జూలై 2: బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంపై వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం జరిగింది. ఆలయ ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో గడచిన 95 రోజులకు భక్తులు స్వామి, అమ్మవార్లకు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.15,58,290 వచ్చినట్లు కందుకూరు జనార్దన స్వామి ఆలయ ఈవో వై.బైరాగి చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత బ్యాంక్ ఉద్యోగులు, దేవాదాయ విశ్రాంత ఉద్యోగి శీనయ్య పాల్గొన్నారు.

ఎల్లలు దాటుతున్న తెల్లరాయి!

● యథేచ్ఛగా అక్రమ రవాణా

● లారీల ద్వారా చెన్నైకి.. అక్కడి నుంచి విదేశాలకు..

● ప్రభుత్వ ఖజానాకు గండి.. పట్టించుకోని అధికారులు

మండలంలోని పలు ప్రాంతాల్లో అటవీ, రెవెన్యూ భూముల్లో లభించే తెల్లరాయిని అక్రమంగా తవ్వి ఎల్లలు దాటిస్తున్నారు. లారీల్లో చెన్నైకి, అక్కడి నుంచి విదేశాలకు యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతోంది. పెద్దఎత్తున ప్రభుత్వ ఖజానాకి గండి కొడుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.



పోలినేనిచెరువులో అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న తెల్లరాయి

వలేటివారిపాలెం, జూలై 2 : మండలంలోని పోలినేనిచెరువు, వలేటివారిపాలెం, చుండి, అయ్యవారిపల్లె, మాలకొండ, గరుకుపాలెం, అంకభూపాలపురం గ్రామాలలోని అటవీ, రెవెన్యూ భూముల్లో తెల్లరాయి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతోన్నాయి. అటవీ, రెవెన్యూ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా తెల్లరాయి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. నిత్యం టన్నుల కొద్దీ తెల్లరాయి తరలిపోతోంది. దీంతో ప్రభుత్వానికి రాయిల్టీ ఇతరత్రా రూపాల్లో రావల్సిన ఆదాయానికి గండి పడుతోంది. అక్రమార్కులు మాత్రం దండిగా సంపాదించుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం అటు వైపు కన్నెత్తి కూడా చూడక పోవడం వెనుక ముడుపులు ముట్టాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● ప్రభుత్వ ఆదాయానికి గండి

గత కొన్నేళ్లుగా ఆయా గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న తెల్లరాయి వ్యాపారంతో ప్రభుత్వానికి గండి పడుతోంది. ఒక్కో లారీ తెల్లరాయి లక్షన్నర నుంచి 2 లక్షలు వరకు నాణ్యతను బట్టి ధర ఉంది. ఇలా వారానికి పదుల సంఖ్యలో తెల్లరాయి లారీలు, టిప్పర్ల ద్వారా రాత్రిళ్లు ఎల్లలు దాటిస్తున్నారు. మరికొన్ని చోట్ల తెల్లరాయి గుండ్లను ఎక్సకవేటర్లతో పెకిలించి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా రహస్య ప్రాంతానికి తరలించి అక్కడ చిన్న చిన్న సైజులుగా పగలగొట్టి లారీల ద్వారా తరలిస్తున్నారు. అటవీ, రెవెన్యూ భూములో, కొన్ని చోట్ల పట్టా భూములు, అసైన్‌మెంటు భూముల్లో లబ్ధిదారులకు తులమో, ఫలమో ముట్టజెప్పి తెల్లరాయి తవ్వకాలు చేస్తున్నారు.

● దాడులు శూన్యం

తెల్లరాయి తవ్వకాలు విచ్చలవిడిగా సాగుతున్నా అధికారులు దాడులు చేపట్టిన దాఖలాలు లేవు. అసైన్డ్‌భూముల్లో జరుగుతున్న తవ్వకాలు వలన భూములు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. సంబంధిత అధికారులకు తెలిసిన, ప్రజలు సమాచారం ఇస్తున్నా వారు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు.

● అనుమతులు నిల్

ఎక్కడైనా తెల్లరాయి తవ్వకాలు జరపాలంటే రెవెన్యూశాఖకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. అనుమతులు పొందిన తరువాతనే తవ్వకాలు జరపాలి. అలాగే కూలీలకు లేబర్ చట్టం కింద కనీసం వేతనం చెల్లిచడంతోపాటు 8 గంటలు పనిచేయించాలి. పనిచేసే చోట అన్ని సౌకర్యాలు కల్పించాలి. సేకరించిన తెల్లరాయిని తరలించాలన్నా అనుమతి తప్పనిసరి. ఇలాంటిదేమీ లేకుండా తెల్లరాయిని అక్రమార్కులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ తెల్లరాయి తవ్వకాలు నిలిపివేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సచివాలయంలో చిత్రపటాల ఏర్పాటు



చిత్రపటాలు ఆవిష్కరించిన టీడీపీ నాయకులు

వరికుంటపాడు, జూలై 2: గణేశ్వరాపురం సచివాలయంలో మంగళవారం టీడీపీ యువ నాయకులు పేరం సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఫొటోలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు బాధ్యతలు చేపట్టిన వెంటనే ఐదు ప్రధానాంశాలపై సంతకాలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సింగంరెడ్డి వీరరాఘవరెడ్డి, గంటా ఖాజావలి పాల్గొన్నారు.

ఏపీసీ పాఠశాలల ఆకస్మిక తనిఖీ



ఆహారాన్ని పరిశీలిస్తున్న ఏపీసీ ఉషారాణి

అనంతసాగరం, జూలై 2: గౌరవరం ప్రాథమికోన్నత, అనంతసాగరం, కామిరెడ్డిపాడు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను మంగళవారం సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఉషారాణి ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, ఆహారాన్ని పరిశీలించారు. నాడు-నేడు పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-1 జానకీరాం ఉన్నారు.

ఉదయగిరి: స్థానిక ప్రైవేటు పాఠశాలలను మంగళవారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం హోంవర్క్ పుస్త కాలను ముద్రించి విక్రయిం చరాదన్నారు.

స్కూల్ బస్సు ప్రమాదం మనస్సు కలిచివేసింది

● ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి

● మృతుడి కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం



విద్యార్థిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, జూలై 2: స్కూల్ బస్సు ప్రమాదానికి గురై చిన్నారులు గాయపడి బస్సు క్లీనర్ మృతి చెందిన సంఘటన తన మనస్సును కలిచి వేసిందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఆర్‌ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్ బస్సు మంగళవారం ఉదయం ప్రమాదానికి గురై వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న చిన్నారులను ఎమ్మెల్యే పరామర్శించి వారి తల్లిదండ్రులను ఓదార్చి మనోధైర్యం నింపారు. అలాగే డాక్టర్లను అడిగి చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన బస్సు క్లీనర్ చినకొండయ్య మృతదేహం కావలి ఏరియా వైద్యశాల మార్చురీలో ఉండటంతో అక్కడకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి రూ.50వేలు ఆర్థికసాయం ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ రహదారుల అధికారుల అలసత్వం, స్కూల్ యాజమాన్యం అనాలోచిత చర్యలతో డివైడర్‌లను పగుల కొట్టి దారి ఏర్పరుచుకోవటం వలన ఈ ప్రమాదం జరిగిందన్నారు. స్కూల్ యాజమాన్యం ఈ ప్రమాదానికి బాధ్యత వహించి చిన్నారుల వైద్య ఖర్చులను భరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ నగేష్, నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరిపించాలి

ముసునూరు టోల్‌ప్లాజా వద్ద మంగళవారం జరిగిన ఆర్‌ఎస్సార్ స్కూల్ బస్సు ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరువాది భాస్కర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డివైడర్‌ను పగులకొట్టి దారి ఏర్పాటుకు కారకులైన నేషనల్ హైవే, స్కూల్ యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. ప్రమాదంలో మృతి చెందిన బస్సు క్లీనర్ చిన కొండయ్యకు రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ అనధికార దారిని మూసి వేయాలని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



మొక్కలు నాటుతున్న బీజేపీ పట్టణాధ్యక్షుడు కరటంపాటి సుధాకర్

ఆత్మకూరు, జూలై 2: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు అమ్మకు ఒక మొక్క అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పార్టీ శేణులు పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కరటంపాటి సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహేశ్వరరెడ్డి, సమసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ ఏలూరు రామ్‌ప్రసాద్, జేపీ నేతలు వాయగుండ్ల ఉమా మహేశ్వరరావు, బాబురావు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ

సంగం, జూలై 2: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారి అశోక్ ఆధ్వర్యంలో డెంగ్యూ నివారణ మాసోత్సవం సందర్భంగా మంగళవారం డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఫ్లెక్సీ చేతపట్టి డబ్బాలు, ప్లాస్టిక్, టైర్లపై నీటి నిల్వలను తొలిగిందాం, దోమలను అరికడదాం, డెంగ్యూ వ్యాధిని నివారిద్దాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సంగం, జూలై 2: అనసూయనగర్ సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం ఉదయం సెబ్ అధికారులు గుర్తించారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో వారు ఇసుక రీచ్ వద్దకు బయలుదేరగా దువ్వూరు మీదుగా బుచ్చిరెడ్డిపాళెంకు ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఎదురపడింది. ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

అమర సైనికులకు నివాళి

ఆత్మకూరు, జూలై 2: భారత్, చైనా సరిహద్దులోని లడఖ్ ప్రాంతంలో ప్రమావశాత్తు అమరులైన భారతీయ సైనికులకు నివాళులర్పిస్తూ మంగళవారం రాత్రి ఆత్మకూరులో బీజేవైఎం నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక సత్రం సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఈ ర్యాలీని కొనసాగించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు చింతలపల్లి భరత్‌రెడ్డి, అల్లంపాటి సాంబశిరెడ్డి, జిల్లా నాయకులు తిరుమలనాయుడు, సుధాకర్, ఆళ్ల మధుసూధన్, కొల్లి మాధవనాయుడు, కాటా మహేశ్వరరెడ్డి, వాశిపల్లి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో 3 ఆవుల మృతి

కలువాయి, జూలై 2: కుల్లూరులో మంగళవారం ఉదయం విద్యుదాఘాతానికి గురై మూడు ఆవులు మృతి చెందాయి. గ్రామంలోని వెంకయ్యస్వామి ఆలయం సమీపంలో సోమవారం రాత్రి గాలులకు విద్యుత్ తీగ తెగిపడ్డాయి. ఉదయం అక్కడకు వెళ్లిన ఆవులు విద్యుత్ తీగ తగిలి చనిపోయాయి. ఈ సంఘటనపై బాధిత రైతులు విద్యుత్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

సీతారామపురం, జూలై 2: అనారోగ్యంతో మంచానికే పరిమితం అయిన పొలంగారిపల్లి చిట్టిబోయిన చెన్నయ్య కుటుంబానికి జనసేన నాయకులు పెనుబడి రాఘురాములు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ భోగినేని కాశీరావులు చేయూతనిచ్చారు. మంగళవారం వారు రెండునెలలకు కుటుంబ పోషణకు సరుకులు అందజేశారు.

పూడిక తీయండి సారూ..

ఉదయగిరి రూరల్, జూలై 2: పట్టణంలోని అగ్రహారంవీధి మురుగు కాలువలు పూడికతో నిండి మురుగు నీరు పారే అవకాశం లేక రోడ్డుపై పారుతున్నాయి. ఈ సమస్యతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ అధికారులు పారిశ్శు సిబ్బంది ఎలాంటి పనులు చేపట్టక పోవడంతో చెత్తచెదారంతో నిండి దుర్వాసనతో వస్తుందని సమీప నివాసాల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పూడికతీత పనులు చేపట్టాలని కోరుతున్నారు.



పూడికతో నిండిన మురుగు కాలువ

రసాభాసగా ఉపాధి గ్రామసభ



నిధుల దుర్వినియోగంపై ప్రశ్నిస్తున్న స్థానికులు

అనంతసాగరం, జూలై 2: స్థానిక సచివాలయం-1 వద్ద మంగళవారం జరిగిన ఉపాధిహామీ గ్రామసభ రసాభసగా మారింది. ఏడాది పాటు గ్రామంలో జరిగిన ఉపాధి పనులపై ఆడిట్ సిబ్బంది కొన్ని రోజులుగా విచారణ చేశారు. చేసిన పనులు, పనికెళ్లిన వారి వివరాలను గ్రామసభలో వెల్లడించడంతో స్థానికులు అభ్యంతరం తెలిపారు. పీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పనికి వెళ్లని వారి పేర్లతో దొంగ మస్టర్లు నమోదు చేసి భారీగా నిధులు దుర్వినియోగం చేశారని, సమగ్రంగా విచారణ జరిపి నిధుల రికవరీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఏపీవో దయాసాగర్‌తో కొందరు వాగ్వివాదం చేశారు. పనులపై విచారణ జరపకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభ, ఎంపీటీసీ రాపూరు సుజాతమ్మ, ఈవోపీఆర్డీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ పింఛన్ల పంపిణీ

సీతారామపురం, జూలై 2: మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం రెం డవరోజు కొనసాగినట్లు ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. మొదటిరోజు 92శాతం పింఛన్లు పంపిణీ చేశామని, మిగిలిన 8శాతం పింఛన్లను మంగళవారం సచివాలయ, అంగ న్‌వాడీ సిబ్బందితో పంపిణీ చేయించామన్నారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ రమేష్ చంద్ర, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

కలువాయి: అనారోగ్యంతో నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కనుపూరుపల్లి గ్రామానికి చెందిన వాకాటి లక్ష్మమ్మకు మంగళవారం సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. అలాగే చింతలాత్మకూరుకు చెందిన నాగిరెడ్డి శంకరమ్మ అనే వృద్ధురాలు కడప జిల్లా పొద్దుటూరులోని కొవ్వూరు రామసుబ్బారెడ్డి వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతుంది. మంగళవారం సచివాలయ సిబ్బంది, గ్రామ సర్పంచుతో కలసి అక్కడకు వెళ్లి పింఛను నగదును అందజేశారు. ఇద్దరు వృద్ధులు ఆనందం వ్యక్తం చేసినట్లు పింఛను అందజేసిన సిబ్బంది తెలిపారు.

చెరువు అలుగు కాలువలను పరిరక్షించాలని వినతి



మంత్రి ఆనంకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఆత్మకూరు, జూలై 2: ఆక్రమణలోని ఆత్మకూరు చెరువు అలుగు కాలువలను పరిరక్షించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు లక్కు కృష్ణప్రసాద్, ప్రముఖ న్యాయవాది కే వీ శేషారెడ్డి మంగళవారం రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆత్మకూరు స్పార్క్ సిటీ యాజమాన్యం చెరువు అలుగులను 3.82సెంట్లు ఆక్రమించినట్లు ఇరిగేషన్ ఉన్నతా ధికారుల సర్వేలో తేలిందని విన్నవించారు. ఈ అలుగు ఆక్రమణతో వాశిలి, కుప్పురుపాడు చెరువులకు ఆత్మకూరు చెరువునకు మిగుల జలాలు అందకపోవడంతో సాగునీటికొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ విషయమై మూడేళ్లుగా కలెక్టర్, ఇరిగే షన్‌శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు.

పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యం

ఉదయగిరి రూరల్, జూలై 2: ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు శివకల్పన తెలిపారు. మంగళవారం డెంగ్యూ నివారణ మాసోత్సవాల్లో భాగంగా వైద్యఆరోగ్య సిబ్బంది పట్టణంలో నినాదాలతో కూడిన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు, పూలకుండీల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కీటక జనితవ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా బారి నపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు

వరికుంటపాడు, జూలై 2: విరువూరు మారుతీనగర్‌లో నిర్వహించిన సీతారాముల ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలతో పాటు గ్రామోత్సవం, వసంతోత్సవం, పారువేట కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదానం చేశారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలోని బీసీకాలనీ సమీపంలో వెలసిన సంతానలక్ష్మి ఆలయ 16రోజుల పర్వదిన వేడుకలను ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు వేకువజాము నుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నడింపల్లిలో..: గ్రామంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న సీతారాముల ఉత్సవాలు ముగిశాయి. నిర్వాహకులు వసంతోత్సవం, ఉట్టుకొట్టుట, పారువేట కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరిం చారు.

వరికుంటపాడు: విరువూరు మారుతీనగర్‌లో నిర్వహించిన సీతారాముల ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలతో పాటు గ్రామోత్సవం, వసంతోత్సవం, పారువేట కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదానం చేశారు.

పగిలిన ఆర్టీసీ బస్సు టైరు

ఉదయగిరి, జూలై 2: స్థానిక డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు టైర్ మంగళవారం ఉదయం బస్టాండ్ సెంటర్‌లో పగిలిపోయింది. బస్సు తెల్లవారుజామున బద్వేల్‌కు వెళ్లింది. తిరిగి ఉదయగిరి చేరుకుంది. గండిపాళెం మార్గంలోని పెట్రోల్ బంకు వద్ద తిరిగి వెళుతుండగా ముందు వైపు టైరు పెద్ద శబ్ధంతో పగిలింది. డ్రైవర్ గమనించి చాకచక్యంతో బస్సును నిలిపివేశాడు. లేకపోతే పక్కనే ఉన్న దుకాణాల్లోకి దూసుకెళ్లేది.

7న మాదిగల ఆత్మగౌరవ కవాతు

వింజమూరు, జూలై 2: జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ నెల 7న నిర్వహించనున్న మాదిగల ఆత్మగౌరవ కవాతు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో సంఘం సభ్యులతో సమావేశమై మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఏర్పడి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ కవాతును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్‌మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగలు, వడ్లపల్లి కృష్ణయ్య, గోసాల సుధాకర్ మాదిగ, మల్లెల తిరుమలేష్ మాదిగ పాల్గొన్నారు.

ప్రజలకు దగ్గరగా ఉంటేనే సమస్యల పరిష్కారం

● విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే కాకర్ల



ఎమ్మెల్యే కాకర్లకు హారతులిస్తున్న మహిళలు

కొండాపురం, జూలై 2: ప్రజలకు దగ్గరగా ఉంటేనే సమస్యల పరిష్కారం సులభంగా ఉంటుందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మొదటిసారిగా మడంలంలోని మర్రిగుంటలో మంగళవారం టీడీపీ నాయకులు చిట్టాబత్తిన మాచర్ల, చిట్టాబత్తిన బ్రహ్మయ్య, పామూరి తిరుపతిరెడ్డి, పఠై మాలకొండరాయుడు, దార్ల గోవిందు ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవర్యాలీలో ఆయన పాల్గొన్నారు. మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు విన్న కాకర్ల త్వరలో అన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ కాలనీ వద్ద టీడీపీ జెండా ఆవిష్కరించారు. గతంలో కాకర్ల ట్రస్టు ద్వారా రూ.1 లక్ష విరాళంగా తీసుకుని పోతురాజు గుడి ప్రహరీ నిర్మించడంతో అక్కడకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దేవుడిని ప్రార్థించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఒక్క రోజులో దాదాపు 95 శాతం పింఛన్లను సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయించామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిలేని పాలన అందించేందుకు కృషి చేస్తానన్నారు. కాగా ఎమ్మెల్యే పర్యటన ఉన్నప్పటికీ ఒక్క అధికారి కనిపించకపోవడంపై కాకర్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎం.ఓంకారం, నాయకులు పోలినేని రమేష్, దామా మహేశ్వర రావు, పీ.చంద్రబాబునాయుడు, డీ.అశోక్, ఎన్.శివన్నారాయణ, వల్లూరు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడుకు చేరిన అమరావతి రైతుల పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

ఉలవపాడు, జూలై 2 : రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడితే తిరుమలకు పాదయాత్ర చేస్తామన్న మొక్కును చెల్లించేందుకు అమరావతి రైతులు చేపట్టిన పాదయాత్ర మంగళవారం ఉలవపాడుకు చేరింది. ఈ పాదయాత్రలో ఉలవపాడు జాతీయ రహదారిపై తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొని అమరావతి రైతులతో కలిసి టీడీపీ మండల కార్యాలయం వరకు పాదయాత్ర చేసి సంఘీభావం తెలిపారు. పార్టీ కార్యాలయం వద్ద తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు ప్రభావతి అమరాతి రైతులకు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కందుకూరు, ఉలవపాడు మండలాల అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, రాచగల్లు సుబ్బారావు, నేతలు పొడపాటి సుధాకర్, పొడపాటి మహేష్, దశరధ, మాల్యాద్రి, వెంకట్రావు, శివకుమార్, శ్రీను, కొండపనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ

అల్లూరు, జూలై 2 : ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు జీవితాలకు భరోసా ఇస్తుందని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. మండలంలో ఇస్కపల్లిలో మంగళవారం ఆయన లబ్ధిదారు లకు పింఛను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు పాపనబోయిన రత్తయ్య, కార్యదర్శి తెనాలి మురళీకృష్ణ, సచివాయల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఆసుపత్రికి వెళ్లి పింఛను పంపిణీ

కందుకూరు : పింఛన్‌దారులు అందుబాటులో ఉన్నా ఏవో సాంకేతిక కారణాలు చూపి వారికి నగదు ఇవ్వకుండా ఇబ్బందులపాల్జేసిన గత ప్రభుత్వంలోని పరిస్థితులు మారిపోయాయి. కందుకూరు పట్టణంలోని జనార్దనకాలనీకి చెందిన వంగపాటి రాములమ్మ కేన్సర్‌తో బాధపడుతూ గుంటూరులోని ఒమేగా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా 1వ సచివాలయం అడ్మిన్ రాంబాబు మంగళవారం అక్కడికి వెళ్లి ఆ మహిళకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదు రూ.7వేలు అందజేసి వచ్చారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక సరఫరా చేయాలి

బిట్రగుంట, జూలై 2: ఎన్నికల కోడ్‌తో నిలిపి వేసిన ఇసుక రవాణాను ప్రభుత్వ నిబంధనల మేరకు సరఫరా చేయాలని బోగోలు మండల సీపీఎం కార్యదర్శి తుమ్మల వెంకయ్య కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సీఐటీయు మండల అధ్యక్షుడు చల్లా నరహరి, భవన కార్మిక సంఘ సభ్యులతో కలసి ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే.బాదుల్లా, టీ.శ్రీనివాసులు, వెంకయ్య, పీ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రసన్నుడికి ప్రత్యేక పూజలు

బిట్రగుంట: బోగోలు మండలం కొండబిట్రగుంట నివాసి ప్రసన్న వేంకటేశ్వరస్వామిని ఆలయ మాజీ చైర్మన్ నగళ్ల కిరణ్‌కుమార్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కావలి మాజీ జట్పీడీసీ కందల శ్రీనివాస్, కావలి సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు నాగంగారి శ్రీనివాసులు, గద్దే వెంకటేశ్వర్లు, చల్లా రవి, మురళీ ఉన్నారు.

'టీఆర్‌ఆర్'లో ఆన్‌లైన్ ప్రవేశాల ప్రారంభం

కందుకూరు, జూలై 2: స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీఎస్సీ, బీకాం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈనెల 10వ తేది వరకు గడువు పొడిగించినందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 5న కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన, 11నుంచి 15 వరకు కళాశాలలో కోర్సుల ఆప్షన్ల ఎంపిక, 19న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 8686368689, 9490300526ను సంప్రదించవచ్చునని తెలిపారు.

ఏపీ ఎన్జీవో 4వ తరగతి ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



4వ తరగతి ఉద్యోగుల కార్యవర్గంతో నాయకులు

కావలిటౌన్, జూలై 2: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన డివిజన్ స్థాయి సమావేశం ఏపీ ఎన్జీవో నాల్గవ తరగతి ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా చింతపూడి రవి, అసోసియేట్ అధ్యక్షుడుగా షేక్ గయాజ్, ఉపాధ్యక్షుడుగా రవి కుమార్, ప్రధాన కార్యదర్శిగా కనకాద్రి, అసోసియేట్ కార్యదర్శిగా జమీల, కోశాధికారిగా బట్టి శ్రీనాథ్, సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సందీప్ చక్రవర్తి, డివిజన్ అధ్యక్షుడు ఎన్ శివకుమార్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి విద్యాసాగర్, ఏపీ ఎన్జీవో డివిజన్ ఉపాధ్యక్షుడు దీక్షితులు, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

కత్తితో దాడి : ఒకరికి గాయాలు

కావలి రూరల్, జూలై 2: కావలి మండలం రుద్రకోట ఆటోస్టాండ్ సమీపంలో టీ కొట్టు వద్ద మంగళవారం రాత్రి ఓ వ్యక్తి పాలకీర్తి దుర్గయ్యపై కత్తితో దాడి చేశాడు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పాత గొడవలు దృష్టిలో పెట్టుకుని పెదనాన్న కొడుకైన ఆదిశేషు మద్యం మత్తులో దాడికి పాల్పడగా స్థానికులు అడ్డుకోవడంతో అక్కడ నుంచి పారిపోయాడు. గాయపడిన దుర్గయ్యను చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

లింగసముద్రం, జూలై 2 : డయేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లింగసముద్రం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.రమేష్ చెప్పారు. మంగళవారం డయేరియాను ఆపండి, డెంగ్యూ మాసోత్సవాల కార్యక్రమాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూరాధ, సీహెచ్‌ఓ జి.శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం లింగసముద్రం పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన జీ.అరుణను వైద్యులు, సిబ్బంది, తదితరులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

రక్తదానం

దగదర్తి(బిట్రగుంట), జూలై 2: రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పుట్టిన రోజు సందర్భంగా దగదర్తి మండలం దామవరంలోని బీఎంఆర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆవరణంలో మంగళవారం కంపెనీల మేనేజర్లు శంకర్ నారాయణ, సుకుమార్‌రెడ్డి, వీరాస్వామి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కావలి రెడ్‌క్రాస్ సౌజన్యంతో మేనేజర్ బ్రహ్మానందరెడ్డి, సెక్యూరిటీ ఎండీ డాక్టర్ శేషాద్రియాదవ్, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కావలి మున్సిపల్ మాజీ చైర్మన్ నగళ్ల కిరణ్‌కుమార్, కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రమణ్యం యాదవ్, అదనపు మేనేజర్లు కిషోర్, సురేష్, మోహిద్దీన్, వినోద్ పాల్గొన్నారు.

బస్సు క్లీనర్ మృతికి సంతాపం

బిట్రగుంట, జూలై 2: కావలి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోగోలు పంచాయతీ యాదవపాలెంకు చెందిన స్కూలు బస్సు క్లీనర్ దేవరాల చిన్నకొండయ్య (67) మృతి చెందారు. ఆయన మృతికి టీడీపీ, బీజేపీ మండల కన్వీనర్లు మాలేపాటి నాగేశ్వరావు, నూకసాని శ్రీనివాసులు యాదవ్, రాజ్యలక్ష్మి, చిలకపాటి వెంకటేశ్వర్లు, పోతల శీనయ్య, దొడ్ల అంజయ్య, నేతిపిచ్చయ్య, గనిపిన్నేని నాగరాజు, సురేష్ సంతాపం తెలిపారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం

కావలి, జూలై 2: దివ్యాంగుల పింఛన్ రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచటాన్ని హర్షిస్తూ టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మన్నవ వెంకట్రావు ఆధ్వర్యంలో మంగళవారం కావలి ఏరియా వైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దివ్యాంగులు సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి, నాయకులు నన్నూరి మాధవరావు, ప్రళయకావేరి రాజు, శ్రీను, వేణు, క్రిష్ణా, సోమయ్య, మరియమ్మ, పోలమ్మ, రావమ్మ తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

కందుకూరు, జూలై 2: పట్టణంలోని జనార్దనకాలనీ ప్రాథమిక పాఠశాలలోని నిరుపేద విద్యార్థులకు మోపాడుకు చెందిన తోకల వెంకటేశ్వర్లు మంగళవారం నోట్‌పుస్తకాలు, కేయాన్స్, పెన్నులు, ప్యాడ్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జి.రామలక్ష్మమ్మ, సీఆర్‌పీ పీఎస్ ప్రతిభ, ఉపాధ్యాయినిలు పి.శాంత కుమారి, బి.పద్మ, జి.రాధిక తదితరులు పాల్గొన్నారు.

99 శాతం పింఛన్ల పంపిణీ

మనుబోలు, జూలై 2: మండలంలోని 19 పంచాయతీల్లో మంగళవారం నాటికి 99శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఏవో రవికుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, ఇతర సామాజిక పింఛన్లు 5815వరకు ఉన్నాయి. 5,716మందికి పంపిణీ చేశారు. ఒక్కనెలలోనే పింఛన్లు తీసుకునేవారు 37మంది చనిపోవడంతో వారి పింఛన్ ఆగిపోయింది. ఇక 22మందికి మాత్రమే పంపిణీ చేయాల్సి ఉందని ఏవో తెలిపారు.

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తోటపల్లిగూడూరు, జూలై 2: నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మంగళవారం చింతోపు ఎంపీపీ యూపీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఇంకా బడికి రాని పిల్లలందరినీ బడిలో చేర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా అవగాహన కల్పించారు. విద్యార్థులంతా ప్లకార్డులు పట్టుకుని నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు జగన్ పుణ్యమే : కాకాణి

ముత్తుకూరు : సామాజిక పింఛన్లు మాజీ సీఎం జగన్ పుణ్యమేనని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ముత్తుకూరు వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజలకు సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకు చేర్చిన ఘనత తమదేనన్నారు. పథకాల అమలులో కార్యకర్తలకు అన్యాయం జరిగితే న్యాయపోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ సుగుణ, నాయకులు చిన్నపరెడ్డి శివప్రసాద్, వెంకటేశ్వర్లు, జనార్దన్‌రెడ్డి, సురేష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆ డివిజనిస్తే రుణం తీర్చుకుంటా !

- నేతలకు కార్పొరేషన్ ఆర్‌ఐల వేడుకోలు
- నెల్లూరులో డివిజన్ల మార్పునకు సన్నాహాలు
- సిద్ధమవుతున్న బదిలీ దస్త్రం

'అన్నా... నమస్తే....! మీ పరిధిలో ఉండే ఆ డివిజన్లకు ఆర్‌ఐగా నాకు అవకాశం ఇవ్వండి. మీరు చెప్పిందల్లా చేస్తా. మీ వెంటే ఉంటా. ఏ పనికీ అడ్డు చెప్పను'... ఇలా నెల్లూరు నగర పాలక సంస్థలో పనిచేసే కొందరు ఆర్‌ఐలు అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. మరికొందరైతే రెవెన్యూ పరంగా సమకూరే ఆదాయ మార్గాలను సైతం నాయకులకు వివరించి అవి మీకు అందాలంటే నన్ను ఆర్‌ఐగా వేయించండి అని వేడుకుంటున్నారు. ప్రస్తుతం నగరంలో ఆర్‌ఐలకు డివిజన్ల మార్పు ఫైల్ సిద్ధమవుతోందన్న ప్రచారంతో ఆశావహుల పైరవీలు జోరందుకున్నాయి.



నెల్లూరు(సిటీ), జూలై 2 : నెల్లూరు నగర పాలక సంస్థలో మొత్తం 54 డివిజన్లు ఉండగా వాటికి పది మంది ఆర్‌ఐలున్నారు. వీళ్లలో కొందరు ఏళ్ల తరబడి ఒకేచోట పాతుకుపోయి ఉన్నారు. మరికొందరు ఇటీవల ఆర్‌ఐలుగా కొత్తగా వచ్చారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం కొలువు తీరడంతో అన్ని శాఖల్లో ఉద్యోగుల మార్పులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కార్పొరేషన్‌లోనూ ప్రక్షాళన దిశగా అడుగులు పడుతున్నాయి. తొలిగా రెవెన్యూ విభాగంలోని ఆర్‌ఐలు ఆ తరువాత ఆర్వోలకు డివిజన్లు మారుస్తారనే చర్చ జరుగుతోంది. దీనికి సంబంధించి కార్పొరేషన్ ఉన్నతాధికారులు కూడా దస్త్రం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ తరుణంలో తాము కోరు కున్న డివిజన్లు పొందేం దుకు ఆర్‌ఐలు ప్రయత్ని స్తున్నారు. భవన నిర్మా ణాలు ఎక్కువగా జరుగు తున్న ప్రాంతాలపైనే దృష్టి సారించిన కొందరు ఆర్‌ఐలు ఆ డివిజన్లు తమకే కేటాయించాలని పట్టుపడుతున్నారు. అలాగే, ఖరీదైన నివాస ప్రాంతాలతో పాటు కమర్షియల్ ప్రాంతా లనూ ఎంచు కుంటున్నారు. ఇందుకోసం అధికార పక్షం నాయ కుల ద్వారా సిఫార్సు చేయించే పనిలో నిమగ్నమయ్యాయి.

ఆదాయ మార్గాలు చూపుతున్న ఆర్‌ఐలు

నెల్లూరులో కార్పొరేషన్ అధికారులు దోచుకునేందుకు అనేక మార్గాలు న్నాయి. వాటిల్లో రెవెన్యూ విభాగం ద్వారా వచ్చే ఆదాయం మరింత ఎక్కువే. వాటిని నేతలకు రుచి చూపిస్తున్న కొందరు ఆర్‌ఐలు ఆ డివిజన్లలో తమకు అవకాశం కల్పిస్తే ఆదాయం సృష్టించడం తోపాటు మీ మాటకు ఎదురులేకుండా చేస్తామంటూ ప్రసన్నం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. అయితే ఆర్‌ఐలకు డివిజన్ల కేటాయింపుపై టీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీతో అంటకాగిన వారిని గుర్తిస్తున్నారు. ఆ డివిజన్లలో ఆర్‌ఐలకు ఉన్న సంబంధాలపై ఆరా తీయడమేకాక సదరు ఆర్‌ఐలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను కూడా తెలుసుకుంటున్నారు.

కలెక్టర్‌తో ఎమ్మెల్యేల భేటీ



కలెక్టర్‌తో భేటీ అయిన కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), జూలై 2 : జిల్లాలోని కావలి, కోవూరు శాసన సభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మంగళ వారం కలెక్టర్ హరినారా యణన్‌ను మర్యాదపూర్వ కంగా కలిశారు. వారి నియోజకవర్గాల సమస్యల ను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నియోజకవర్గాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న సయ్యద్ సిరాజ్

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు

- సీపీఐ నగర సహాయ కార్యదర్శి సిరాజ్

నెల్లూరు(వైద్యం), జూలై 2 : ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ వెల్లడించారు. మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్ల గడిచినా కేంద్రం ప్రత్యేక హోదా మాత్రం ఇవ్వలేదని ఆరోపించారు. తనకు 25 మంది ఎంపీలను ఇస్తే ప్రత్యేక హోదా సాధిస్తానని గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బీరాలు పలికారన్నారు. అయితే ఆయన పాల నలో హోదాసహా రాష్ట్రానికి రావాల్సిన అన్నింటినీ విస్మరిం చారని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అయినా ప్రత్యేక హోదా తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు ఆజీజ్ అహ్మద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షాన్‌వాజ్, సీపీఐ నేతలు మున్వర్, శంకర్, షబ్బీర్, షాకీర్, రియాజ్, కిశోర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతపై అవగాహన కలిగి ఉండాలి



సీఈవో జీజేరావును సన్మానిస్తున్న పోర్టు ప్రతినిధులు

ముత్తుకూరు, జూలై 2 : విద్యుత్ భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అదానీ పోర్టు స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్ గ్రూప్ హెచ్‌ఆర్ హెడ్ జె.కురాణ తెలిపారు. మంగళవారం పోర్టులో నిర్వహించిన జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల నుంచి ఏ విధంగా రక్షణ పొందాలి, భద్రతా చర్యలు ఎలా చేపట్టాలి అనే విషయాలను వివరించారు. గత నెల 26 నుంచి నిర్వహించిన వారోత్సవాల్లో పోర్టు ఉద్యోగుల కార్మికులకు అవగాహనతోపాటు డెమోలు ఇవ్వడం ద్వారా విద్యుత్ భద్రతపై పోర్టు ఎలక్ట్రికల్ హెడ్ ఎస్‌జి.నాగేశ్వరరావు అవగాహన కల్పించారు. పలు కార్యక్రమాలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహాలను అందించారు. నేషనల్ ఎలక్ట్రికల్ సేఫ్టీ వీక్ 2024 విజయవంతం కావడానికి కృషి చేసిన వారందరినీ పోర్టు సీఈవో జీజేరావు అభినందించారు. కార్యక్రమంలో సీఓఓ రాజన్‌బాబు, అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ జీ.వేణుగోపాల్, వివిధ విభాగాలు హెచ్‌ఓడీలు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో లేకుంటే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న టీడీపీ మండలాధ్యక్షుడు మోహన్ కృష్ణారెడ్డి

సైదాపురం, జూలై 2: టీడీపీ అంటేనే క్రమ శిక్షణకు మారుపేరని అలాలేని వారిపై పార్టీ అధిష్ఠానం తప్పక చర్యలు తీసుకుంటుందని పార్టీ మండలాధ్యక్షుడు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్టీ మండలస్థాయి సమావేశంలో మాట్లాడారు. దేవరవేమూరు పంచాయతీలోని ఆరగుంట ప్రసన్న కుమార్ రెడ్డి, ఆరగుంట రమేష్‌రెడ్డిలు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా, టీడీపీని నమ్ముకుని కష్టపడి పని చేస్తున్న నాయకులు, కార్యకర్తలపై వ్యక్తిగత దూషణలు చేయడం విచారకరం అన్నారు. పార్టీ క్రమశిక్షణ చర్యల కింద వారిని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, నలమారు వెంకటేశ్వర్లురెడ్డి, రాజశేఖర్‌రాజు, వరిగొండ సురేంద్ర, తొండాపు విజయ్ శంకర్, మేడికొండ రమణయ్యనాయుడు, కేపీ రాజు, పడ్డాల కిరణ్‌యాదవ్, హరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరిస్తా : సోమిరెడ్డి



కేఆర్‌ఆర్ నగర్ వాసులతో ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, జూలై 2 : మండలంలో తాగు, సాగునీటి సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని కేఆర్‌ఆర్ నగర్‌లో ఉన్న శ్రీప్రసన్న పోలేరమ్మ పొంగళ్ల కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో ఇక్కడి ప్రజలు తన గెలుపు కోసం మొక్కుకుని, మొక్కు చెల్లించడం ఆనందంగా ఉందన్నారు. గత ప్రభుత్వం పట్టించుకోకుండా వదిలేసిన కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ కరెంటు బిల్లులు, అసంపూర్తిగా వదిలేసిన దక్షిణ కాలువ పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, బొమ్మి సురేంద్ర, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జానీమాస్టర్ పుట్టినరోజు

కొడవలూరు జూలై 2: మండలంలోని టపాతోపు గ్రామంలో ఉన్న విశ్వజనని అనాథ శరణాలయంలో మంగళవారం ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీమాస్టర్ జన్మదిన వేడుకలు జరిగాయి. నేతాజీ అభ్యుదయ సేవాసమితి అధ్యక్షుడు కోవూరు వెంకీ ఆధ్వర్యంలో చిన్నారుల చేత కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంత రం ఆయన మాట్లాడుతూ నేటి యువత జానీ మాస్టర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గుట్కా వ్యాపారానికి నిలయం ఆ గ్రామాలు

తోటపల్లిగూడూరు, జూలై 2 : మండలంలోని నరుకూరు సెంటర్, మహాలక్ష్మీపురం, సాలిపేట సెంటర్లు నిషేధిత గుట్కా వ్యాపారానికి నిలయాలుగా ఉన్నాయి. పై ప్రాంతాల్లోని పలు దుకాణాల్లో నిషేధిత మాదక ద్రవ్యాల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇక్కడ గుట్కా, ఖైనీ హాన్స్‌లను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ఇటీవల పోలీసులు దాడులు చేసి రూ.లక్షల్లో సరుకు స్వాధీనం చేసుకున్నారు. సెబ్ అధికారులు మాత్రం భారీగా ముడుపులు తీసుకుని వ్యాపారాలకు అనుమతి ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ నాయకులను, అధికారులు అడ్డం పెట్టుకుని మండలంలోని అన్నీ దుకాణదారులకు మహాలక్ష్మీపురం నుంచే నిషేధిత గుట్కాల సరఫరా సాగుతున్నాయి. ఓ వైపు ప్రభుత్వం నిషేధిత విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నా, సరైన నియంత్రణ లేకపోవడంతో మాదకద్రవ్యాల వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు గుట్కా వ్యాపారం చేసే దుకాణాలపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత



రామయ్యకు పింఛను అందిస్తున్న సచివాలయ ఉద్యోగి

లబ్ధిదారులు ఎక్కడుంటే సచివాలయ ఉద్యోగులు అక్కడికి వెళ్లి మంగళవారం పింఛను పంపిణీ చేశారు. పొదలకూరు మండల పరిధిలోని మరుపూరు సచివాలయ పరిధిలోని పోలిశెట్టి శ్రీలక్ష్మి నెల్లూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉంది. దీంతో వెల్ఫేర్ అసిస్టెంట్ విజేత అక్కడికెళ్లి పింఛను అందించారు. అలాగే పొదలకూరు బిట్-2లో ఉండే నున్నా రామయ్య నెల్లూరు జయభారత్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అతడికి కూడా ఆసుపత్రి వద్దే హార్టికల్చర్ అసిస్టెంట్ దీప్తి పింఛను అందించారు. అలాగే తోడేరు సచివాలయం పరిధిలో గల చప్రం గౌతమ్ నెల్లూరులో చికిత్స పొందుతుండగా, తోడేరు వీఆర్‌వో పేరయ్య అక్కడికి వెళ్లి పింఛను అందించారు. దీంతో ఆయా పింఛనుదారులు ఆనందం వ్యక్తం చేశారు.

- పొదలకూరు

రాజకీయ కారణాలతో 'ఉపాధి' పనులు ఆపొద్దు

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పుల్లయ్య



మాట్లాడుతున్న మంగళం పుల్లయ్య

నెల్లూరు(వైద్యం), జూలై 2 : రాజకీయ కారణాలు చూపి ఉపాధి హామీ పనులు ఆపవద్దని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళం పుల్లయ్య కోరారు. మంగళవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆ సంఘం సమావేశం జరిగింది. పుల్లయ్య మాట్లాడుతూ గతంలో ఉన్న ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అధికారులను మార్చి అధికార పార్టీ మాటవినే వారినే పెట్టుకోవాలన్న ఉద్దేశంతో ప్రస్తుతం ఉపాధి హామీ పనులు జరపటం లేదని ఆరోపించారు. జిల్లాలో వ్యవసాయ పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లోనే 'ఉపాధి' పనులు జరుగుతున్నాయని, మిగిలిన చోట్ల అనేక మంది కూలీలు పనుల్లేక అల్లాడుతున్నారన్నారు. ఈ క్రమంలో పనులు జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, ఉపాధి కూలి కూడా రూ. 300 ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరు మాల్యాద్రి, జిల్లా కమిటీ సభ్యులు పెద్దబ్బయ్య, బెల్లంకొండ నాగమ్మ, భూలోకం కాంతారావు, గండవరపు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సహకార దినోత్సవ గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

నెల్లూరు(హరనాథపురం), జూలై 2 : అంతర్జాతీయ సహకార దినోత్సవ గోడపత్రికను జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ మంగళవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ఆవిష్కరించారు. ఈనెల 6న అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ఘనంగా జరపడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సహకారశాఖాధికారి బీ గురప్ప జాయింట్ కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు, సహకార విద్యాధికారి జీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

13న విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

నెల్లూరు (సాంస్కృతి కం), జూలై 2 : జిల్లాలోని కుమ్మర, పద్మశాలి విద్యార్థులకు ఈనెల 13న ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్నట్లు కుమ్మరి, శాలి వాహన సంఘం జిల్లా అధ్యక్షుడు కేఎస్ నరసయ్య, ప్రధాన కార్యదర్శి పీ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులకు వివరాలు వెల్లడించారు. నగరంలోని కొత్తూరు అంబాపురం రోడ్డులో గల శాలివాహన సంఘం కల్యాణ మండపంలో పురస్కారాల ప్రదానోత్సవం జరుగు తుందని తెలిపారు. 10వ తరగతి పరీక్షల్లో 450పైన, ఇంటర్‌లో 750 మార్కులు పైబడి సాధించిన వారికి నగదు, ప్రశంసా పత్రాలు అందిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9573038716, 9849866559, 9347109450 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నిస్సహాయ మహిళల కోసమే దిశా ప్రొటెక్షన్

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 2 : సమాజంలో వివిధ రకాలుగా హింసకు గురవుతున్న నిస్సహాయ మహిళల కోసం దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు ఆ ఫౌండే షన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ బీ వెంకటేశ్వరరాజు తెలిపారు. మంగళవారం టౌనుహాలులో ఫౌండేషన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యాలయాలు, పనిచేసే చోట, ఇతర ప్రదేశాల్లోనూ మహిళలు హింసకు గురవుతున్నారని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో ప్రతి జిల్లాలో తమ ఫౌండేషన్ కమిటీలు ఉన్నాయని, మహిళల సమస్యలపై తక్షణం స్పందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లి, విమల, జిల్లా అధ్యక్షురాలు ఎన్ నిర్మలనాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించకుంటే సీజ్

- రెస్టారెంట్, బార్లకు ఎంహెచ్‌వో నోటీసులు

నెల్లూరు(సిటీ), జూలై 2 : నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్దనున్న తేజస్విని రెస్టారెంట్ అండ్ బార్, వనంతోపు కూడలిలో గల బ్లూ ఫాక్స్ బార్లకు మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకట రమణయ్య మంగళవారం నోటీసులు జారీ చేశారు. ఆ రెండు వ్యాపార కేంద్రాల్లో పరిశుభ్రత పాటించడంలేదని, కాలం చెల్లిన వస్తువులను వినియోగిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. తేజస్విని రెస్టారెంట్‌లోని వంటశాలలో మాంసాహార నిల్వలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. బ్లూ ఫాక్స్ బార్లో నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేశారు. అనంతరం వివరణ కోరుతూ ఆ రెండింటి యజమానులకు నోటీసులు ఇచ్చారు.

బుద్ధిని భగవంతుడి వైపు మరల్చడమే రుక్మిణీ కల్యాణం

- ప్రవచనకర్త లక్ష్మీ నరసింహారావు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 2 : భాగవతంలో రుక్మిణీ కల్యాణ ఘట్టం విశిష్టమైనదని, జీవుడి బుద్ధి భగవంతుని వైపు మరలించడమే దీని ఆంతర్యమని ప్రవచనకర్త పోలవరపు లక్ష్మీ నరసింహారావు తెలిపారు. బాలాజీనగర్ సీతారామమందిరంలో పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న కృష్ణ చరిత్ర సప్తాహం మంగళవారంతో ముగిసింది. మెట్టు రామచంద్రప్రసాద్, డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు, సుబ్బు శ్రీనివాస్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా చక్రస్నానం

- ముగిసిన గురువాయురప్పన్ బ్రహ్మోత్సవాలు



చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 2 : నగరంలోని అయ్యప్ప గుడి ప్రాంగణంలో ఉన్న గోదా, మహాలక్ష్మీ సమేత గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు ఉదయం చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. ముందుగా మహాకుంభారాధన, హోమం, నవకలిశ స్నపన తిరుమంజనం, శాత్తుమురై, అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మహా పూర్ణాహుతి, ధ్వజావరోహణం, పుష్పయాగం, మహా కుంభ సంప్రోక్షణ, ఏకాంత సేవ జరిగాయి. భద్రాచలం సీతారామస్వామి దేవస్థానం అర్చకుడు కోమండూరు ఇలైవల్లి తలసాయి స్వామి వారి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగాయి. ఆలయ చైర్మన్ శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కేజీ శంకర్, కత్తి మోహన్‌రావు, ఉభయకర్తలు చైతన్యకుమార్ రెడ్డి, శిరీష పర్యవేక్షించారు.

భుజంపై కేన్సర్ గడ్డ తొలగింపు

- 'రెయిన్‌బో'లో శస్త్రచికిత్స విజయవంతం

నెల్లూరు(వైద్యం), జూలై 2 : నగరంలోని రెయిన్‌బో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో కేన్సర్ వ్యాధిగ్రస్తునికి అరుదైన శస్త్రచికిత్సను విజయవంతగా నిర్వహించారు. మంగళవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆర్థో అంకో సర్జన్ డాక్టర్ అనిల్ చౌదరి మాట్లాడుతూ చీరాలకు చెందిన దుర్గాప్రసాద్ (27) అనే యువకుడు కుడిభజంపై గడ్డతో ఆసుపత్రికి వచ్చాడన్నారు. పరీక్షలు నిర్వహించి దానిని కేన్సర్ గడ్డగా గుర్తించామన్నారు. ఆ గడ్డ రక్తనాళాలకు అతుక్కుని ఉండటంతో చాకచక్యంగా శస్త్రచికిత్స చేసి తొలగించామని చెప్పారు. వ్యాధిగ్రస్తుడు పూర్తిగా కోలుకున్నాడని తెలిపారు. ఆసుపత్రి సూపరిండెంటెండ్ డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఈ శస్త్రచికిత్స చేశామన్నారు.

రొట్టెల పండుగ కమిటీ చైర్మన్‌గా ఖాదర్‌బాషా



నెల్లూరు (సాంస్కృతికం), జూలై 2 : ఈనెల 17 నుంచి ప్రారంభమయ్యే బారా షహీద్ దర్గా గంధ మహోత్సవం, రొట్టెల పండుగ నిర్వహణకు ఉత్సవ కమిటీని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎంపిక చేశారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డుకు ఆ జాబితాను మంగళవారం పంపినట్లు తెలిసింది. ఎమ్మెల్యే కార్యాలయంలో కార్యకర్తల సమక్షంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కాంట్రాక్టరు షేక్ ఖాదర్‌బాషా పేరు ప్రకటించారు. ఆయనతోపాటు మరో 35 మంది కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. కాగా, ఎమ్మెల్యే కోటంరెడ్డి పర్యవేక్షణలో దర్గాలో రొట్టెల పండుగ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

ఏపీజేయూ జిల్లా కార్యవర్గం ఎంపిక

నెల్లూరు(హరనాథపురం); జూలై 2 : ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్(ఏపీజేయూ) జిల్లా అధ్యక్షుడిగా చక్రవర్తి నియమితులయ్యారు. మంగళవారం ఆ యూనియన్ నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకులు ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా గర్రే వెంకటేశ్వర్లు, కోశాధికారిగా మదన్, ఉపాధ్యక్షుడిగా ఎం మురళీమోహన్, సంయుక్త కార్యదర్శిగా యాదాల కృష్ణకిషోర్‌ను ఎంపిక చేశారు.

వీధి కుక్కలకు జనన నియంత్రణ శస్త్రచికిత్సలు

- మున్సిపల్ మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), జూలై 2 : నెల్లూరులోని వీధి కుక్కలకు జనన నియంత్రణ శస్త్రచికిత్సలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్‌ను ఆదేశించారు. సోమవారం నగరంలోని చిల్డ్రన్స్ పార్కులో పిచ్చకుక్క స్వైర విహారంతో పలువురికి గాయాలైన ఘటనపై మంత్రి స్పందించారు. నగరంలో కుక్కల బెడద తగ్గించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని మంగళవారం కమిషనర్‌కు సూచించారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న వీధి కుక్కలకు జనన నియంత్రణ ఆపరేషన్లు చేయించాలన్నారు. చిల్డ్రన్స్ పార్కులో కూలిన గోడను యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని ఆదేశించారు. గోడ నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.

దివ్యాంగుల పాఠశాలలో పెన్నులు, పుస్తకాల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 2 : రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పుట్టినరోజు వేడుకలు మంగళవారం రెడ్‌క్రాస్ భవనంలోని దివ్యాంగుల పాఠశాలలో జరిగాయి. బీఎంఆర్ యూత్ లీడర్ బీ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు అందజేశారు. మస్తాన్ రావు చేస్తున్న సామాజిక సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ దాసరి రాజేంద్రప్రసాద్, నేతాజీ సుబ్బారెడ్డి, బీఎంఆర్ యువత శ్రీను, జోషి, చరణ్, రమేష్, సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం : నిరుపయోగంగా గృహ నిర్మాణ పరికరాలు



తుప్పు పట్టిన గృహ నిర్మాణ పరికరాలు

వెంకటాచలం, జూలై 2: ప్రభుత్వం నిర్మించే పక్కా ఇళ్లకు సిమెంట్ తలుపులు, కిటికీలు తయారు చేసే పరికరాలు అధికారుల నిర్లక్ష్యంతో మూలపడ్డాయి. వెంకటాచలంలో జాతీయ రహదారి పక్కన గతంలో గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో పరికరాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రానికి సిమెంట్ ఇటుకలు, తలుపులు, ద్వార బంధనాలు, కిటికీలు తయారు చేసే పరికరాలను కూడా అందజేశారు. ఇక్కడి నుంచే గతంలో వెంకటాచలం మండలంలో పక్కా ఇళ్లు నిర్మించుకునేవారికి ఇక్కడి నుంచే కిటికీలు, తలుపులు, ద్వార బంధనాలను సరఫరా చేసేవారు. గతంలో ఈ కేంద్రం గృహనిర్మాణశాఖ కార్యాలయంలో పాత ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉండేది. ఈ కార్యాలయానికి అనుసంధానంగా ఉంటుందని తయారీ కేంద్రం వద్దకు మార్చారు. ప్రస్తుతం తయారీ కేంద్రం ఉన్న స్థలంలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. దీంతో తయారీ వస్తువులను పక్కన పడేయగా, అవి తుప్పుపట్టిపోయాయి. అధికారులు స్పందించి వాటిని తిరిగి వినియోగంలోకి తీసుకునిరావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణ కేంద్రం ద్వారా మంచి ఫలితాలు



ఈ కేంద్రం ద్వారా తయారు చేసిన పరికరాలను పక్కా ఇళ్ల లబ్ధిదారులకు బాగానే సరఫరా చేశారు. అయితే గతంలోనే తయారీని నిలిపి వేశారు.దీంతో పక్కా ఇళ్ల లబ్ధిదారులు బయట ప్రాంతాల నుంచి సిమెంటు ఇటుకలు, ఇతర వస్తువులు తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. ఇళ్ల నిర్మాణ ఖర్చు కూడా అమాంతం పెరిగింది.


- డబ్బుగుంట సురేంద్ర, కాకుటూరు

పరికరాలు తుప్పుపట్టాయి



అధికారుల నిర్లక్ష్యం కారణంగా సిమెంట్ తయారీ పరికరాలు తుప్పు పట్టిపోయాయి. ఈ కేంద్రాన్ని వినియోగంలోకి తేస్తే పక్కా ఇళ్లు నిర్మించుకునేవారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి దీన్ని వినియోగంలోకి తీసుకుని రావాలి.

- ఈపూరు శరత్‌నాయుడు, పూడిపర్తి



సీతాకోక చిలుకలు పూసిన చెట్లు





గ్లాసీ టైగర్





బ్లూ టైగర్



కామన్ ఎమిగ్రాంట్ | కామన్ గ్లాసీ | యూప్లో మల్సీబర్ | స్పాటెడ్ రస్టిక్ | హైపోలిమ్నస్

చినుకు రాలి నేల చల్లబడగానే కొండాకోనా పచ్చదనం పురివిప్పుకుంది. మబ్బుల చాటు నుంచి కిరణాలు తాకిన చెట్టూపుట్టా పువ్వూమొగ్గా పులకించిపోతోంది. ప్యూపాల్లో దాగిన సీతాకోకమ్మలు రెక్కలు విప్పుకుని విహారానికి బయలుదేరుతున్నాయి. తిరుమల కొండకు వచ్చే భక్తులకు కొత్త అందాలు కనువిందు చేస్తున్నాయి. నేల పిగిలినట్లు.. కొమ్మకొమ్మా సీతాకోక చిలుకలను పూసినట్లు గుత్తులు గుత్తులుగా కనిపిస్తున్నాయి. ఎన్ని రకాలో.. ఎన్ని వర్ణాలో... నెలరోజుల ఆయుష్షే అయినా ఆనందంగా పువ్వు పువ్వుమీదా వాలుతూ ఎగురుతూ మధువు గ్రోలుతూ.. ఈ దృశ్యాలు చూసి మనసు రెక్కలు తొడుక్కుంటోంది. ఫలదీకరణలో కీలక పాత్ర పోషిస్తూ వన విస్తరణకు దోహదపడేలా ప్రకృతి సృష్టించిన ఈ సౌందర్యజీవుల అందాలను తిరుమల ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కెమెరాలో బంధించి అందిస్తున్నారు...


తిరుమలలో 105 రకాల సీతాకోక చిలుకలు

శేషాచలంలో 105 రకాల సీతాకోక చిలుకలున్నట్టు అంచనా.వీటిల్లో దాదాపు సగం జనసంచారం ఉన్న చోట్ల కనిపిస్తాయి. మిగిలినవి అడవుల్లో నీటి చెలమలున్న తావుల్లోనే ఉంటాయి. సీతాకోక చిలుకల్లో అరుదైనదిగా చెప్పుకునే కామన్ బ్యాండెడ్ పికాక్ తిరుమలలో అక్కడక్కడ కనిపిస్తోంది. అతిపెద్ద సీతాకోక చిలుకగా చెప్పుకునే బ్లూ మర్మోన్ కూడా తరచూ దర్శనమిస్తోంది. వీటితో పాటు ప్రస్తుతం ఈ సీజన్‌లో బ్లూ టైగర్, గ్లాసీ టైగర్, యూప్లో మల్సీబర్, కామన్ ఎమిగ్రాంట్, స్పాటెడ్ రస్టిక్, హైపోలిమ్నస్, మిసిప్పస్ జాతి సీతాకోక చిలుకలు భక్తుల మధ్య తిరుగుతూ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఇక క్రిమిసన్ రోస్, లైమ్ బటర్‌ఫ్లై, స్పాట్ స్వార్డ్‌టైల్, మాట్లెండ్ ఎమిగ్రాంట్, కామన్ గ్రాస్ ఎల్లో, కామన్ జెజ్‌బెల్, స్ట్రైటెట్ రస్టిక్, క్రిమ్‌సన్ టిప్, యూప్లో మల్సీబర్, హైపోలిమ్నస్, ట్యాని కోస్టర్, కామన్ సెలర్, లెమన్ ఫాన్సీ, పికాక్ ఫాన్సీ, బ్లూ ఫాన్సీ, చాకోలెట్ ఫాన్సీ డైనెడ్ ఎగ్‌ఫ్లై, ఫైన్ టైగర్, కామన్ ఇండియన్ క్రో వంటి రకాలు కూడా కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తూ ఉంటాయి.

- తిరుమల,ఆంధ్రజ్యోతి



నామినేటెడ్ పదవుల కోసం పోటాపోటీ



కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. మంత్రి వర్గం ముచ్చటా ముగిసింది. నామినేటెడ్ పదవులు ఆలస్యంచేయకుండా వెంటనే భర్తీ చేస్తామని సాక్షాత్తూ టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబే ప్రకటించారు. దీంతో జిల్లావ్యాప్తంగా కూటమి పార్టీల నేతల్లో జోష్ నెలకొంది. ఇక నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న నాయకుల ప్రయత్నాలైతే జోరందుకున్నాయి. ఎన్డీఏ కూటమిలో టీడీపీ, జనసేన, బీజేపీ వుండడంతో ఆ మేరకు పదవుల కోసం పోటీ తీవ్రంగా పెరిగింది. జిల్లాలో ప్రధానంగా వున్నవే తుడా, టీటీడీ బోర్డు కావడంతో ఆశావహులందరి దృష్టీ ఆ రెండింటిపైనే వుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- తుడా, టీటీడీ బోర్డుపైనే పలువురి దృష్టి
- అధిష్ఠానాలకు సంక్లిష్టంగా మారిన ఎంపిక

తిరుపతి టీడీపీ నుంచీ పెద్ద సంఖ్యలో ఆశావహులు

కూటమిలో ప్రధాన పక్షమైన తెలుగుదేశం పార్టీ నుంచీ ఆశావహులు పెద్దసంఖ్యలో పదవుల కోసం రేసులో వున్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తాను టికెట్ త్యాగం చేసినందున దానికి తగ్గట్టుగా ఎమ్మెల్సీ లేదా తుడా ఛైర్‌పర్సన్ పదవితో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ సైతం తనకు టికెట్ దక్కనందున అధినేత చంద్రబాబు ఏదో ఒక కీలక పదవి కట్టబెడతారని భావిస్తున్నారు. కూటమి అభ్యర్థికి తొలుత మద్దతు ప్రకటించి వెంట ప్రచారానికి వెళ్ళిన టీడీపీ అధికార ప్రతినిధి కోడూరు బాల సుబ్రమణ్యం తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్ష పదవితో పాటు తుడ ఛైర్మన్ పదవి ఆశిస్తున్నారు. టికెట్ దక్కనందున అధిష్ఠానం ఈ రెండు పదవులతో న్యాయం చేస్తుందని విశ్వసిస్తున్నారు. మబ్బు దేవనారాయణరెడ్డి తుడా ఛైర్మన్ గిరీ ఆశిస్తుండగా శ్రీధర్ వర్మ గత ప్రభుత్వంలోనూ పదవి దక్కని నేపథ్యంలో ఈ పర్యాయం తప్పనిసరిగా టీటీడీ బోర్డు మెంబరు పదవి దక్కుతుందని గట్టి నమ్మకంతో వున్నారు. ఆయనకు ఎన్టీఆర్ కుటుంబ సభ్యుల మద్దతు వుండడం అదనపు బలం కానుంది. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ ఏకైక కార్పొరేటర్‌గా గెలిచి తిరుపతిలో పార్టీ ప్రతిష్టను, ఉనికిని చాటిన ఆర్సీ మునికృష్ణ తుడా అధ్యక్ష పదవి గానీ లేదా టీటీడీ బోర్డు మెంబరు గానీ ఇస్తారన్న నమ్మకంతో వున్నారు. అవి తప్పినా గతంలో గంగమ్మ ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్‌గా గుడిని గణనీయంగా అభివృద్ధి చేసినందున మరోసారి ఆయనకు గంగమ్మ ఆలయ ఛైర్మన్ పదవి దక్కే అవకాశముంది. ఇక టికెట్ రేసులో చివరికంటా నిలిచి నిరాశకు లోనైన ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి పదవి ఆశిస్తున్నారు.

చంద్రగిరి నుంచీ కీలక పదవులు ఆశిస్తున్న టీడీపీ నేతలు

చంద్రగిరి పరిస్థితుల కారణంగా ఎమ్మెల్యే పులివర్తి నానీకి గత ప్రభుత్వంలో చెవిరెడ్డికి దక్కిన తరహాలో ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. అదనపు ప్రోటోకాల్ వర్తించేలా ప్రభుత్వ విప్, తుడా ఛైర్మన్ పదవులు రెండూ ఆయనకు కేటాయించాలని ఆశిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో తిరుపతిలో పార్టీ గళం వినిపించడంతో పాటు నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో ఆరంభం నుంచీ తుదికంటా కష్టపడిన రవినాయుడు తుడా పదవితో తన కష్టానికి న్యాయం చేస్తారని ఆశిస్తున్నారు. ఇదే నియోజకవర్గం నుంచీ ఎన్నికల సమయంలో టీడీపీలో చేరిన డాలర్స్ దివాకర రెడ్డి, బడి సుధా యాదవ్ తుడా లేదా దానికి సమానమైన ప్రాధాన్యత కలిగిన పదవులను ఆశిస్తున్నారు. మరో ముఖ్యనేత వీరపల్లి హేమాంబరధర రావు టీటీడీ బోర్డు మెంబరు పదవిని కోరుకుంటున్నారు. తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ కమ్మ కార్పొరేషన్ అధ్యక్ష పదవిని లేదా ఏదో ఒక కార్పొరేషన్ పదవిని కోరుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికలను పార్టీ బహిష్కరించినా ఆమె ఒక్కరే ఎంపీటీసీగా పోటీ చేసి బరిలో నిలిచారు. పార్టీ కోసం బాగా కష్టపడ్డారని శ్రేణుల్లో పేరున్న ఆమె పలు క్రిమినల్ కేసులు సైతం ఎదుర్కొంటున్నారు. కాగా శ్రీకాళహస్తి నుంచీ మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ఎమ్మెల్సీ పదవి ఆశిస్తున్నారు.

నామినేటెడ్ పదవుల రేసులో మిత్రపక్షాల నేతలు

కూటమిలో మిత్రపక్షాలుగా కొనసాగుతున్న జనసేన, బీజేపీల నుంచీ కూడా పలువురు నేతలు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు. జనసేన పార్టీకి సంబంధించి జిల్లా మొత్తం మీద పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ పేర్లే ప్రముఖంగా వినిపిస్తున్నాయి. టికెట్ జనసేనకు కేటాయించినప్పటికీ స్థానికంగా వున్న వీరిని కాదని ఇతరులకు కేటాయించినందున ఇపుడు నామినేటెడ్ పదవులతో తమకు న్యాయం జరుగుతుందని వీరు భావిస్తున్నారు. వీరిద్దరూ తుడా ఛైర్మన్ లేదా టీటీడీ బోర్డు మెంబర్ పదవిని ఆశిస్తుండడం గమనార్హం. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో తరచూ పవన్ కళ్యాణ్‌పై విమర్శలకు దిగే అప్పటి మంత్రి రోజాను దీటుగా ఎదుర్కొని క్రిమినల్ కేసులతో, అరెస్టులతో కష్టనష్టాలు అనుభవించిన కిరణ్ రాయల్ తన కష్టాన్ని పార్టీ గుర్తించి న్యాయం చేస్తుందన్న నమ్మకంతో వున్నారు. బీజేపీ విషయానికొస్తే గత ఐదేళ్ళలో టీటీడీకి సంబంధించిన అనేక వివాదాస్పద నిర్ణయాలపై నిరసన గళం వినిపించడంతో పాటు న్యాయస్థానాల్లో పోరాడిన భానుప్రకాష్‌రెడ్డి టీటీడీ బోర్డు సభ్యత్వం ఆశిస్తున్నారు. గత ఈవో ధర్మారెడ్డిని ఎదుర్కొనే క్రమంలో దర్శనాల సదుపాయం కూడా ఆయన కోల్పోయిన సంగతి తెలిసిందే. ఎన్నికల సమయంలో బీజేపీలో చేరిన నవీన్‌కుమార్‌రెడ్డి సైతం టీటీడీ బోర్డు, అధికారుల అనుచిత వైఖరిపై సమర్థవంతంగా పోరాడారు. పలు అంశాల్లో న్యాయస్థానాలనూ ఆశ్రయించారు. మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అండదండలున్నందున తనకు టీటీడీ బోర్డు మెంబరు పదవి దక్కుతుందని నమ్ముతున్నారు. ఇదే కోవలో ఆ పార్టీ నేత సామంచి శ్రీనివాస్ పేరు కూడా వినిపిస్తోంది. శ్రీకాళహస్తికి చెందిన నేత కోలా ఆనంద్ కూడా టీటీడీ పాలకమండలి సభ్యత్వం కోరుకుంటున్నారు.

పదవులు పరిమితం... ఆశావహులు అధికం

జిల్లాలో ప్రధానంగా చెప్పుకోదగ్గ పదవులు తుడా, టీటీడీ పాలకమండలి మాత్రమే వున్నాయి. పార్టీ పదవుల్లో టీడీపీ జిల్లా అధ్యక్ష పదవి, తిరుపతి అసెంబ్లీ ఇంఛార్జి పదవులు రెండు మాత్రమే వున్నాయి. టీటీడీ మెంబరుగా జిల్లా నుంచీ ఒకరిద్దరికి మించి అవకాశం దక్కడం కష్టం. కూటమిలో మూడు పార్టీలు వుండడం, రాష్ట్రవ్యాప్తంగా టీటీడీ బోర్డు మెంబరు పదవికి పోటీ వుండడంతో రెండైనా దక్కుతాయో లేదో అనుమానమే. పదవులు పరిమితంగా వుండడం, ఆశావహుల సంఖ్య ఎక్కువగా వుండడం కూటమి పార్టీల అధిష్ఠానాలకు తలనొప్పిగా మారుతోంది. ఈ పార్టీలతో పాటు సామాజిక సమీకరణల సమతుల్యత కూడా పాటించాల్సి రావడంతో పదవులకు నేతలను ఎంపిక చేసే ప్రక్రియ సంక్లిష్టంగా మారుతోంది. ఇన్ని ఇబ్బందుల నడుమ నామినేటెడ్ పదవులు దక్కించుకునే అదృష్టవంతులెవరో వేచి చూడాల్సి వుంది.

కలెక్టర్‌గా వెంకటేశ్వర్

- గతంలో చిత్తూరు జేసీగా అనుభవం
- ఎల్లుండి బాధ్యతల స్వీకరణ



తిరుపతి(కలెక్టరేట్), జూలై 2: తిరుపతి కలెక్టర్‌గా డాక్టర్ వెంకటేశ్వర్ నియమితులయ్యారు. 2016 ఐఏఎస్‌బ్యాచ్‌కు చెందిన వెంకటేశ్వర్ ప్రస్తుతం సెకండరీ హెల్త్ డైరెక్టర్‌గా, ఏపీ వైద్యవిధాన పరిషత్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. 2021లో చిత్తూరు జిల్లా జేసీ(హౌసింగ్)గా పనిచేసిన ఈయన తరువాత జేసీగా 17 నెలల పాటు విధులు నిర్వహించి వైద్యవిధాన పరిషత్‌కు బదిలీ అయ్యారు. ప్రకాశం జిల్లా కొమరోలు మండలంలోని ఎడమకల్లు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌ది రైతు కుటుంబం. తండ్రి వెంకటయ్య సర్పంచ్‌గా, తల్లి కాశమ్మ జడ్పీటీసీగా కూడా పని చేశారు. వెంకటేశ్వర్ 2012లో ఆంధ్రా మెడికల్ కళాశాలలో మెడిసిన్ పూర్తి చేశారు. అప్పటి కలెక్టర్, ప్రస్తుత టీటీడీ ఈవో శ్యామలరావు స్ఫూర్తితో కలెక్టర్ కావాలనుకున్నారు. ఎకరా పొలం అమ్మి ఆ డబ్బులతో హైదరాబాద్, ఢిల్లీలో కోచింగ్ తీసుకున్నారు.2013లో సివిల్స్‌రాసి ఐఆర్ఎస్(ఇండియన్ రైల్వే అడ్మినిస్ట్రేషన్ సర్వీస్)కు ఎంపికయ్యారు.2015లో మూడవ సారి సివిల్స్ పరీక్షలకు హాజరైతే 216వ ర్యాంకు వచ్చింది. సివిల్ సర్వీసెస్ శిక్షణ పూర్తి చేసుకున్నాక 2018లో విశాఖ జిల్లా పాడేరు సబ్‌కలెక్టర్‌గా నియమితులయ్యారు.ఒకటిన్నర సంవత్సరం తరువాత అక్కడే ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేశారు. 2021లో చిత్తూరు జిల్లా హౌసింగ్ జేసీగా బదిలీ అయ్యారు. జిల్లాల పునర్విభజన తరువాత చిత్తూరు జిల్లా జేసీగా 17 నెలలు పనిచేశారు.శుక్రవారం తిరుపతి కలెక్టరుగా బాధ్యతలు స్వీకరించబోతున్నట్లు వెంకటేశ్వర్ తెలిపారు.

● ఛాలెంజ్‌గా భావిస్తున్నా

రాష్ట్రంలోనే ప్రముఖమైన తిరుపతి జిల్లాలో పనిచేయడం ఓ ఛాలెంజ్‌గా భావిస్తున్నా.గతంలో చిత్తూరు జేసీగా పనిచేశాను కాబట్టి తిరుపతిపై అవగాహన వుంది. శ్రీవారి పాదాల చెంత కలెక్టరుగా అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రయత్నిస్తా.ముఖ్యంగా పబ్లిక్ గ్రీవెన్స్‌పై దృష్టి పెడతా.

తిరుపతిలో షాడో ఎమ్మెల్యే

- కార్పొరేషన్ అధికారులకు దిశానిర్దేశం
- వెల్లువెత్తుతున్న విమర్శలు



తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ పక్కన కుర్చీలో కూర్చుని అధికారులు ఎలా పనిచేయాలో చెబుతున్న శివకుమార్

తిరుపతి, జూలై 2 (ఆంధ్రజ్యోతి):తిరుపతి ఎమ్మెల్యే ఎవరు? ఆరణి శ్రీనివాసులు కదా! మరి అధికారులతో సమావేశాలు పెట్టి ఉపన్యాసాలు దంచుతున్న ఈయన ఎవరబ్బా అని అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఈయనగారి పేరు ఆరణి శివకుమార్. జనసేన నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆరణి శ్రీనివాసులుకు అన్న కుమారుడు. ఎమ్మెల్యే గారు ఎంత బిజీగా ఉన్నారో ఏమో గానీ ఆయన తరపున అధికారుల బదిలీలు మొదలు..సమీక్షల వరకు అన్నీ శివకుమార్ కానిచ్చేస్తున్నారు. తాజాగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ అదితి సింగ్ పక్కన కుర్చీలో దర్జాగా కూర్చుని అధికారులు ఎలా పనిచేయాలో దిశానిర్దేశం చేస్తున్న వీడియో వైరల్ అయ్యింది.గ్రీవెన్స్‌డే సందర్భంగా సోమవారం కమిషనర్‌ను కలిసిన ఆయన పనిలో పనిగా అటెండరు మొదలు కమిషనర్ దాకా అందరూ మంచిగా పనిచేసి ఎమ్మెల్యేకి మంచి పేరు తేవాలని ఉపదేశించారు. ఐఏఎస్ అధికారి అయిన కమిషనర్ కూడా ఈ షాడో ఎమ్మెల్యే ఉపన్యాసాన్ని బుద్ధిగా తల ఊపుతూ వినడమే విచిత్రం. ఎన్నికల సమయంలో తెర వెనుక ఉండి అంతా నడిపిన శివకుమార్ ఇప్పుడు తెరముందుకు వచ్చేశారన్నమాట.

సదరన్ డిస్కం వెబ్‌సైట్, యాప్ ద్వారానే విద్యుత్ బిల్లులు చెల్లించాలి

తిరుపతి(ఆటోనగర్), జూలై 2: సదరన్ డిస్కం పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ బిల్లులను ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారానే చెల్లించాలని సీఎండీ కె.సంతోషరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మార్గదర్శకాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇకపై ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంలతోపాటు ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా బిల్లులను నేరుగా చెల్లించడానికి వీలుండదన్నారు. తమ సంస్థ మొబైల్ యాప్ లేదా ఏపీఎస్పీడీసీఎల్.ఇన్ ద్వారా బిల్ డెస్క్‌కు అనుసంధానమైన ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం యాప్‌లతోపాటు ఇతర యూపీఐ యాప్‌లను ఉపయోగించి చెల్లించాలని సూచించారు. అలాగే నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, వాలెట్, క్యాష్‌కార్డులను కూడా వాడుకోవచ్చని వివరించారు.

తాగునీటి పైపు లైన్లకు మరమ్మతులు



మరమ్మతులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నాయుడుపేట, జూలై 2: పట్టణంలోని ఎల్ఎసాగరం కొంతకాలంగా మున్సిపాలిటీ కొళాయిల్లో కలుషిత నీరు సరఫరా అవుతోంది. 'కలుషిత నీటితో పేటవాసుల అవస్థలు' పేరిట సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పాత ట్రెజరీ కార్యాలయం ఎదుట తాగునీటి పైపు లైన్‌కు సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ఈ మేరకు తాగునీటి పైపులకు ఎక్కడ లీక్ ఉన్నా మరమ్మతులు చేయించి సురక్షితమైన తాగునీటిని అందిస్తామని కమిషనర్ చెప్పారు.

తాగునీటి సరఫరా మెరుగుకు చర్యలు



వేములపాళెం సమీపంలో పైప్‌లైన్‌కు మరమ్మతులు

గూడూరు, జూలై 2: పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టినట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. కండలేరు జలాశయం నుంచి, వేములపాళెం వాటర్‌వర్క్స్ నుంచి పట్టణానికి తాగునీరు అందించే పైప్ లైన్లు పలు చోట్ల లీకేజీల కారణంగా నీరు వృథాగా పోతుండడంతో పట్టణ ప్రజలకు తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారన్నారు. ఈ క్రమంలో పట్టణ ప్రజలకు తాగునీరు అందించే పైప్‌లైన్లు పలు దగ్గర్ల లీకేజీలను గుర్తించి వాటికి మరమ్మతులు చేపడుతున్నట్టు తెలిపారు. దీంతో తాగునీరు వృథా కాకుండా సరఫరా సామర్థ్యం కూడా పెరుగుతుందని కిరణ్‌కుమార్ వెల్లడించారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు మేధాసింగ్



గూడూరు, జూలై 2: జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన విద్యార్థిని మేదాసింగ్‌ను మంగళవారం స్థానిక సాయి విద్యానికేతన్ పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రావణి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జూన్ 24న విజయవాడలో అండర్-13 విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన మేధాసింగ్ ప్రతిభచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులకు బహుమతుల పంపిణీ

గూడూరు, జూలై 2: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని రోటరీ క్లబ్ సభ్యులు ఎ. గోపాల్ రెడ్డి, డాక్టర్ జనార్ధనరెడ్డి అన్నారు. ఏ.ఏ.రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అల్లూరు ఆదిశేషారెడ్డి స్పోర్ట్స్ మీట్‌లో విజేతలకు సోమవారం రాత్రి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో చదివే విద్యా ర్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఈ పోటీలను నిర్వహించామన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. మునిగిరీష్, శ్రీధర్‌రెడ్డి, జీజీనాయుడు, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను నాటడం సామాజిక బాధ్యత



గూడూరు అర్బన్, జూలై 2: మొక్కలను నాటడం సామాజిక బాధ్యతగా భావించాలని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి అన్నారు. మంగళవారం సరస్వతి శిశు మందిరం ఆవరణంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. మొక్కలు నాటడం వలన పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

పాశం గెలవడంతో తిరుమలకు పాదయాత్ర



గూడూరు అర్బన్, జూలై 2: గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పాశం సునీల్‌కుమార్ గెలవడంతో టీడీపీ నాయకులు తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ ఎన్నికల్లో పాశం గెలుపొందితే తిరుమలకు గూడూరు నుంచి పాదయాత్రగా వెళ్లి వేంకటేశ్వరస్వామి దర్శించుకుంటామని స్థానిక తెలుగుయువత నాయకులు మొక్కుకున్నారు. పాశం ఎమ్మెల్యేగా గెలవడంతో మంగళవారం స్థానిక ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహించి పట్టణానికి చెందిన అనీష్ కుమార్, సుధీర్‌కుమార్, క్రాంతి, వెంకటేష్, సాకేత్ కాలినడకన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



బాలాయపల్లి, జూలై2: మండలంలోని గొట్టికాడులో కొలువై ఉన్న పో లేరమ్మకు మంగళవారం పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్. మస్తాన్ నాయుడు, ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి,ఎస్.భాస్కర్‌రావు, సీసీ నాయుడు, ఎం.గోపీకృష్ణా రెడ్డి, కె.రామచంద్ర నాయుడు, బి.కల్యాణ్ రెడ్డి, రవిరెడ్డి, మీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి

తడ, జూలై 2: రైలు నుంచి జారి పడి యువకుడు మృతి చెందాడు. కోల్‌కాతా నుంచి చెన్నై వెళ్తున్న సంత్రాగచి ఎక్స్‌ప్రెస్‌లో పశ్చిమబెంగాల్‌కు చెందిన రతన్(27) ప్రయాణిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఆ రైలు తడ స్టేషన్‌ను నెమ్మదిగా దాటుతుండగా రతన్ ట్రైన్ నుంచి కిందకు దిగే క్రమంలో అదుపుతప్పి జారి పడి రైలు కింద పడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెగా డీఎస్సీతో తీరనున్న ఉపాధ్యాయుల కొరత: కురుగొండ్ల



విద్యా కిట్ల పంపిణీలో ఎమ్మెల్యే కురుగొండ్ల తదితరులు

డక్కిలి, జూలై 2: మెగా డీఎస్సీ తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం డక్కిలి జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ... విద్యాశాఖ మంత్రిగా లోకేశ్ బాధ్యతలు చేపట్టడంతో ఆ శాఖకు పునర్వైభవం సంతరించుకుంటుదన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలన్నదే తన ఆకాంక్షని చెప్పారు. గత ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదన్నారు. ఉపాధ్యాయుల కొరతతో విద్యా ప్రమాణాలు పడిపోయాయన్నారు. అందుకే టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబు మెగా డీఎస్సీ నిర్వహణపై తొలి సంతకం చేశారన్నారు. ఇకపై పాఠశాల్లో వసతులు, విద్యా ప్రమాణాలు, వితరగతి గదులు, మైదానాలు మెరుగ్గా ఉంటాయని చెప్పారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏ. రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పి.కోటేశ్వరరెడ్డి, నాయకులు జి.చంద్రశేఖరరెడ్డి, ఆర్.రాజా, ఎన్.సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో లీలామాధురి, డీఈవో శేఖర్, బాలయోగి బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ చౌడయ్య, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, జగదీష్ బాబు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అందాలతీరం... అభివృద్ధి శూన్యం!



తీరంలో ఆకట్టుకుంటున్న జెట్టి - వారాంతంలో పర్యాటకుల సందడి

వాకాడు, జూలై 2: తూపిలిపాళెం సముద్రతీరం ఆహ్లాదకరంగా ఉండటం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. పారిశ్రామికంగానూ ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అయితే కనీస వసతులు లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. తీరంలో వసతులు కల్పించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని వైసీపీ పాలకులు, అధికారులు తరచూహామీలు ఇచ్చినప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదు. సముద్ర నీటిని రొయ్యల హేచరీలకు ఉపయోగించేలా సముద్రంలో ఏర్పాటు చేసిన జెట్టి పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది. సముద్రంలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు అంచనా వేయడానికి 2017లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 150 ఎకరాల్లో ఎన్ఐఓటి (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ) తూపిలిపాళెం వద్ద ఏర్పాటు చేశాయి. సముద్రం ఒడ్డున 1979లో నిర్మించిన గెస్ట్‌హౌస్ శిథిలావస్థకు చేరి అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. వారంతపు సెలవు దినాల్లో 500మంది పర్యాటకులు సాధారణ రోజుల్లో 50మంది పైగా సందర్శకులు వస్తూ ఉంటారు. పర్యాటకులు సొకచెట్ల కింద సేదతీరాల్సిన పరిస్థితి ఉంది. తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అయినా తూపిలిపాళెంను పర్యాటకరంగా అభివృద్ధి చేస్తారని పర్యాటకులు ఆశిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

● నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం: డీఈవో



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శేఖర్

నాయుడుపేట టౌన్, జూలై 2: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ చెప్పారు. నాయుడుపేట పట్టణంలోని లోతువానిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం డివిజన్ స్థాయిలో ఎంఈవోలు, హెచ్ఎంల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నేను బడికిపోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అలాగే స్టూడెంట్ కిట్ పంపిణీని పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనులను సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను సరైన సమయంలో పూర్తి చేయాలన్నారు. మధ్యాహ్నబోజన పథక నిర్వహణలో లోపాలు ఉంటే కఠిన చర్యలు ఉంటాయన్నారు. యూడైస్ ప్లస్, విద్యా పర్వేష్‌లను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలన్నారు. టెన్త్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఇప్పటినుంచే కృషి చేయాలని ఆదేశించారు. గూడూరు డిప్యూటీ డీఈవో శాంతి, అసిస్టెంట్ ఏఎంవో మధు, ఎంఈవోలు మునిశేఖర్, మునిరత్నంతోపాటు డివిజన్‌లోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వేళ్లు లేని మహిళకు బియ్యం పంపిణీ



కోట, జూలై 2: ప్రమాదవశాత్తు రెండు చేతుల వేళ్లు పోగొట్టుకున్న గిరిజన మహిళ పాపమ్మ నాలుగు నెలలుగా రేషన్ బియ్యం అందకుండా ఇబ్బంది పడుతోంది. ఈ క్రంలో మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఎండీయూ ఆపరేటర్లు బియ్యం ఇవ్వడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేసింది. మండల పరిధిలోని నెల్లూరు పల్లికొత్తపాళెం గిరిజనకాలనీకి చెందిన పాపమ్మకు ఆరు నెలలక్రితం ప్రమాదంలో రెండుచేతుల వేళ్లు కత్తిరించేశారు. ఒంటరి మహిళ అయిన పాపమ్మ అటు కూలీలకు వెళ్లలేక రేషన్ బియ్యంతోనే జీవనం సాగించింది. అయితే ఈపోస్ మెషిన్‌లో ముద్రలుపడని కారణంగా నాలుగు నెలలుగా బియ్యాన్ని నిలిపేశారు. ఎట్టకేలకు తహసీల్దారు డి.నాగరాజరావును ఆశ్రయించగా ఆయన ఎండీయూ ఆపరేటర్లకు ఫోన్ చేసి బియ్యం ఇవ్వాల్సిందిగా ఆదేశించారు.

రేషన్ పంపిణీ తనిఖీ



వాకాడు, జూలై 2 : మండలంలోని వాకాడు గ్రామంలో ఎండీయు వాహనం ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ చేస్తున్న ప్రక్రియను మంగళవారం తహసీల్దారు నరసింహ రావు పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇంటి దగ్గరకే వాహనం వచ్చి రేషన్ ఇస్తున్నారాఅని అడిగి తెలుసుకున్నారు. రేషన్ పంపిణీలో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీటీ సారంగపాణి, ఆర్ఐ సెల్వరాజ్, తదితరులు ఉన్నారు.

మంత్రి ఆనంను కలసిన రంగినేని

నాయుడుపేట టౌన్, జూలై 2: దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని బీజేపీ సీనియర్ నేత రంగినేని కృష్ణయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరు పట్టణంలోని మంత్రి ఆనం స్వగృహంలో మంగళవారం ఉదయం ఆయనకు కృష్ణయ్య పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రిని కలసిన వారిలో డాక్టర్ ఆర్.సురేష్, బీజేపీ నాయకులు ఉన్నారు.

కుష్ఠువ్యాధిగ్రస్థులను గుర్తించండి

చిల్లకూరు, జూలై 2: వైద్యసిబ్బంది గ్రామాల్లో కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కుష్ఠు, క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించి కుష్ఠు, క్షయ, సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠువ్యాధి ఉన్నవారికి శరీరంపై స్పర్శ లేని మచ్చలు, నొప్పిలేని పుండ్లు ఉంటాయన్నారు. కుష్ఠువ్యాధి నిర్ధారణ జరిగితే వారికి ఖరీదైన మందులు, శస్త్రచికిత్సలు ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రాజా, తేజశ్విని, సిబ్బంది మునిలక్ష్మి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో తగ్గుతున్న దిగుబడి

భాకరాపేట, జూలై 2: వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా పంటల దిగుబడి తగ్గిపోతుందని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్ర ఏడీ భాస్కరయ్య తెలిపారు. చిన్నగొట్టిగల్లు వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం రైతులకు వాతావరణ మార్పులు-పంటల దిగుబడిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల వినియోగంతో నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. డ్రిప్ ఇరిగేషన్ వలన నీరు ఆదా చేసుకోవచ్చని, వేరుశనగలో కంది, ఆముదం వంటి అంతర పంటల సాగుతో చీడపీడలను అదుపులో ఉంచవచ్చునన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

రామచంద్రాపురం, జూలై 2: ప్రకృతి వ్యవసాయంతో ఎంతో మేలు కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం షణ్ముగం అన్నారు. మంగళవారం మండలంలోని అనుప్పల్లి, సి.కాలేపల్లె, నెత్తకుప్పం, వేపకుప్పం, రాయలచెరువు, కుప్పంబాదూరుతో పాటు పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయపద్ధతుల్లో సాగు చేస్తున్న పొలాలను సందర్శించారు. ఖరీఫ్ ప్రారంభమైన నేపథ్యంలో పీడీఎంఎస్ వేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించాలని సిబ్బందిని ఆదేశించారు.

వ్యాధిగ్రస్తులకు పింఛన్ అందజేత

కోట, జూలై 2: పలు వ్యాధులతో నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు వయో వృద్ధులకు మంగళవారం పంచాయతీ కార్యదర్శి అల్లాబక్షు, మత్స్యశాఖ అసిస్టెంట్ నాగరాజు వెళ్లి అందజేయడంతో వారి ముఖాల్లో ఒక్కసారిగా ఆనందం వెల్లివిరిసింది. మండల పరిధిలోని గోవిందపల్లిపాళెంకు చెందిన పి.యానాదయ్య మధుమేహం కారణంగా పాదాన్ని తొలగించారు. దీంతో నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అదే విధంగా వెంకన్నపాళెంకు చెందిన కృష్ణయ్య క్యాన్సర్‌తె నెల్లూరులోని క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరిద్దరికీ వారు చికిత్స పొందుతున్న ఆస్పత్రుకే వెళ్లి పింఛన్ అందజేశారు.

చిట్టమూరు: మండల పరిధిలోని ఈశ్వరవాక గ్రామానికి చెందిన యల్లసిరి హేమలత అనారోగ్యం కారణంగా నెల్లూరు జనరల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండడంతో పంచాయతీ కార్యదర్శి షేక్ అహ్మద్ భాషా మంగళవారం నెల్లూరుకు వెళ్లి పింఛను అందజేశారు

ప్రజలకు అందుబాటులో సచివాలయాల సేవలుండాలి

ఓజిలి, జులై 2: సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని, కారదర్శులను ఎంపీడీవో శ్రీనివాసులు ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం కార్యదర్శలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను నిర్వర్తించడంతో పాటు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని తెలిపారు.

వసతి గృహ విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, జూలై 2 : పట్టణంలోని ఓ వసతి గృహ విద్యార్థిని అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం ఎప్పటిలాగే విద్యార్థిని వసతిగృహం నుంచి కళాశాలకు వెళ్లింది. సాయంత్రం ఆ విద్యార్థిని వసతి గృహానికి తిరిగి రాకపోవడంతో పరిసర ప్రాంతాలలో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో మంగళవారం ఉదయం వసతి గృహ అధికారి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

పెళ్లకూరు, జూలై 2: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డీఎల్‌పీవో రవీంద్రబాబు తెలిపారు. మండల పరిధిలోని అర్థమాల, ఆర్లపాడు, పునబాక, అక్కగారిపేటల్లోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు తాగునీటి వనరులను పరిశీలించారు. అనంతరం అక్కగారిపేటలో నూతంగా ఏర్పాటు చేసిన బోరును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మధుమోహన్ దాస్ పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌పై దూసుకెళ్లిన ఆటో



కోట, జూలై 2: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తిపై మంగళవారం ఆటో దూసుకెళ్లింది. ఈ సంఘటనలో కృష్ణమూర్తి ఎడమకాలు, ఎడమచేతికి తీవ్ర గాయాలవడంతో స్థానికులు ఆయన్ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోట ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ఆటోవాలాలు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.91 కోట్లు

తిరుమల, జూలై2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.91 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 75,449 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 27,121 మంది తలనీలాలు సమర్పించారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు, జూలై 2: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని మంగళవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు వారికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు చదువే ఆస్తి: విజయశ్రీ



బ్యాగు అందిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, ఆర్డీవో తదితరులు

సూళ్లూరుపేట, జూలై 2: విద్యార్థులకు చదువే ఆస్తి అని పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం సూళ్లూరుపేట పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యా కిట్లను పంపిణీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థికీ బ్యాగు, నోటు, పాఠ్యపుస్తకాలు, షూస్, యూనిఫాం అందిస్తామన్నారు. ప్రతి విద్యార్థీ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదవితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునన్నారు.అంతకుముందు ఆమె ఆర్డీవో చంద్రమునితో కలిసి సరస్వతి విగ్రహానికి పూజలు చేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేష్, ఏజీ కిషోర్, నాయకులు పెరుమాల్, శంకరయ్య, దంతాల రవి, నాపా మునిరాజా, రాము, ఎంఈవోలు శ్రీనివాసులు రెడ్డి, శీనయ్య, సరస్వతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖర్ పాల్గొన్నారు.

రికవరీలపై దృష్టి సారించండి



దిశానిర్దేశం చేస్తున్న ఇన్‌చార్జి ఏపీఎం

బాలాయపల్లి, జూలై 2: పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న స్త్రీనిధి, ఉన్నతి సహా పలు రకాల రుణాల రికవరీపై దృష్టి సారించాలని ఇన్‌చార్జి ఏపీఎం శ్రీనివాసులు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో వీఓఏలతో సమీక్ష నిర్వహించారు. గ్రామ సంఘాల సమావేశాలు విధిగా నిర్వహించడంతో పాటూ రికార్డుల నిర్వహణ చేపట్టాలన్నారు. సీసీలు ఇందిర, వెంకటరమణయ్య, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చౌక దుకాణాల తనిఖీ



మతకాముడి రేషన్ షాపు తనిఖీలో తహసీల్దార్

సూళ్ళూరుపేట, జూలై 2: మండలంలోని మతకాముడి, గోపాల్ రెడ్డిపాళెంలలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ చౌక దుకాణాలను తనిఖీ చేశారు. రేషన్ షాపుల్లో స్టాక్ వివరాలు తప్పని సరిగా పొందుపరచాలని ఆదేశించా. కార్డులకు దారులకు తొలి వారంలోనే సరుకులు అందించాలన్నారు. ఉదయం 6 గంటల నుంచే అన్ని చౌక దుణాల్లో బియ్యం పంపిణీ జరగాలన్నారు. అనంతరం అక్కడున్న కార్డుదారులతో ఆయన మాట్లాడి పంపిణీలో సమస్యలడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు వెంకటగిరి పోలేరమ్మ హుండీ లెక్కింపు

వెంకటగిరి టౌన్, జూలై 2: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ హుండీ లెక్కింపు బుధవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి మంగళవారం తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే భక్తులు మగవారు పంచె, ఉత్తరీయం, మహిళలు చీర ధరించి హాజరుకావచ్చన్నారు. ఎటువంటి ఆభరణాలు, ఫోన్ నగదు లేకుంత హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.

రెజ్లింగ్ పోటీల్లో జిల్లావాసులకు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

నాయుడుపేట, జూలై 2: సౌత్ ఇండియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు తమిళనాడులోని సెలంలో జూన్ 28, 29, 30 తేదీల్లో నిర్వహించారు. రెజ్లింగ్ పోటీలలో తిరుపతి జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించినట్లు తిరుపతి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ తెలిపారు. కె.హర్షిత వెండి పతకం, ఇ. లోకేష్, పి.కవిల్‌రాజ్, పి.రేణుక, కె.హర్షిత క్యాంస పతకాలను సాధించినట్లు తెలిపారు. వీరిని జిల్లా స్పోర్ట్స్ డెవలెప్‌మెంట్ ఆఫీసర్ సయ్యద్, కార్యదర్శి ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సుదీప్‌రెడ్డి, సహకార్యదర్శులు దారా రవి, రవిరెడ్డి, అభినందించారు.

గిరిజనులకు కోళ్ల పంపిణీ



కోళ్లను పంపిణీ చేస్తున్న టీవీఎస్ ట్రస్టు నిర్వాహకులు

వెంకటగిరి టౌన్, జూలై 2: గ్రామీణాభివృద్ధే ధ్యేయంగా శ్రీనివాస సేవా ట్రస్టు(టీవీఎస్) పని చేస్తుందని ట్రస్టు క్లస్టర్ ఇన్‌ఛార్జి జయసింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని జువ్వమాని కండ్రిగ, పాళెంకోట, టీపీ కండ్రిగ, విశ్వనాథపురం, ఆర్ఎస్‌కండ్రిగ, నీలకంఠపురం, ఏటీ కండ్రిగ, వడ్డిపల్లి, వర్ధనపల్లెల్లోని గిరిజనలకు కోళ్లను పంపిణీ చేశారు. నాటు కోళ్ల పెంపకాన్ని ప్రోత్సాహించి గిరిజనులు ఆర్థికంగా ఎదగడానికి కుటుంబానికి పది కోళ్ల పంపిణీ చేస్తున్నామని జయసింగ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సిబ్బంది సతీష్, అలేఖ్య, సురేష్, సాయి, కేశవ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

తడ, జూలై 2: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం సమయంలో గ్రద్దగుంట సమీపంలో విజయవాడ వైపు వెళ్లే రైలు మార్గంలో ఓ వ్యక్తి అటుగా వెళ్తున్న రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం రైల్వే పోలీసులకు చేరడంతో వారు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వద్ద తమిళనాడు తిరవళ్లూరుకు చెందిన ఆసుపత్రి పత్రాలు మాత్రమే ఉన్నాయి. ఎటువంటి ఆధారాలు దొరకలేదు. దీంతో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేశామని సీఆర్‌పీ ఎస్ఐ కొండప్పనాయుడు తెలిపారు. అయితే దొరికిన పత్రాలను బట్టి తిరువల్లూరు పోలీసులతో సంప్రదిస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.